

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 30-06-2025 | సంపుటి - 24 | సంచిక - 57 | రూ : 4 | పేజీలు : 8


## రామచందర్‌రావు, ఈటలలో ఒకరికి అవకాశం!

- భాజపా అధ్యక్షుడు ఎవరో తేలేది నేడే

**జూన్ 29, హైదరాబాద్:** భాజపా రాష్ట్ర అధ్యక్ష పదవికి తుది రేసులో ఇద్దరి పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌లలో ఒకరికి అవకాశం దక్కే వీలుందని విశ్వసనీయ సమాచారం. కాబోయే నూతన అధ్యక్షుడికి సోమవారం ఉదయం జాతీయ నాయకత్వం నుంచి ఫోన్ ద్వారా సమాచారం అందనున్నట్లు తెలిసింది. రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం నియమితులైన ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజే ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. జాతీయ ప్రధాన

తరువాయి 2లో







## మావోయిస్టుల అడ్డాగా రాష్ట్రాన్ని మార్చొద్దు

- రేవంత్‌నుద్దేశించి అమిత్‌షా వ్యాఖ్య
- కొందరు కాంగ్రెస్ వాళ్లు శాంతిచర్చలు అంటున్నారు
- మావోయిస్టుల చేతిలో ప్రాణాలొదిలిన ఆదివాసీ కుటుంబాలకు ఏం చెబుతారు?
- 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని తుదముట్టిస్తాం
- భారాస హయాంలో భారీ అవినీతి... అయినా కేసులేవి
- నిజామాబాద్‌లో కేంద్ర హోంమంత్రి
- జాతీయ పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం

2లో

## ఒప్పందం కుదుర్చుకోండి

- ఇజ్రాయెల్-హమాస్‌లకు స్పష్టంచేసిన ట్రంప్

టెల్ అవీవ్: గాజాలో జరుగుతున్న యుద్ధాన్ని వేగంగా ముగించి, సంధి కుదుర్చుకోవాలని ఇజ్రాయెల్‌హమాస్‌లకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించారు. ఈ మేరకు ఆయన తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఆదివారం ఉదయం పోస్టు పెట్టారు. ''ఒప్పందం చేసుకోండి. బందీలను వెనక్కి తీసుకురండి'' అని అందులో పేర్కొన్నారు. వచ్చే వారంలోపు రెండు వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదురుతుందని శనివారం కూడా ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అవినీతి కేసులు ఎదుర్కొంటున్న

తరువాయి 2లో




## ఎమ్మెల్యేలూ.. తీరు మార్చుకోండి

- ప్రజలతో మమేకమైతేనే భవిష్యత్తు
- నా సూచనలు పాటిస్తే మళ్లీ ఎన్నికవుతారు.. లేదంటే ఇంటికే
- కొత్తగా ఎన్నికైన వాళ్లు.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
- జనసేన, భాజపా శ్రేణులతో సమన్వయం చేసుకోండి
- తెదేపా విస్తృతస్థాయి సమావేశంలో సీఎం చంద్రబాబు ఘాటు హెచ్చరికలు
- సమావేశానికి 56 మంది గైర్హాజరుపై తీవ్ర అసంతృప్తి



2లో

## ఆ నాలుగు గ్రామాలను తెలంగాణలో కలపండి

- అగ్రి వర్సిటీలో పసుపు పరిశోధన కేంద్రం నెలకొల్పాలి
- అమిత్‌షాకు మంత్రి తుమ్మల వినతి

**జూన్ 29, హైదరాబాద్:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలం చుట్టూ ఉన్న ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో విలీనం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. పసుపు రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం మరిన్ని చర్యలు తీసుకోవాలని, అధిక కర్క్యుమిన్ శాతం, ఎగుమతులకు అనుకూలమైన విత్తన రకాల అభివృద్ధి కోసం జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక పసుపు పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఆదివారం నిజామాబాద్‌లోని బస్వా గార్డెన్‌లో పసుపు రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో

తరువాయి 2లో



## ఉత్తరాదిని ముంచెత్తిన వానలు


**ఉత్తరాఖండ్‌లో ఇద్దరి మృతి**

- 24 గంటల పాటు చార్‌ధామ్ యాత్ర నిలిపివేత
- ఝార్ఖండ్‌లో 162 మంది విద్యార్థులు సురక్షితం



**జూన్ 29, రాంచీ:** వాయవ్య, మధ్య, ఈశాన్య రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఉత్తరాఖండ్‌లోని ఉత్తర్‌కాశీ జిల్లాలో కుంభవృష్టి కారణంగా యమునోత్రి జాతీయ రహదారిలోని సిలాయ్ బైండ్‌లో ఆదివారం కొండచరియలు విరిగి పడ్డాయి. దీంతో నిర్మాణంలో ఉన్న ఓ హోటల్ కుప్పకూలింది. ఈ ఘటనలో ఇద్దరు భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఏడుగురి ఆచూకీ గల్లంతైంది. ఘటనాస్థలానికి 18 కిలోమీటర్ల దూరంలోని తిలాడీ షాహిద్ స్మారక్ వద్ద

తరువాయి 2లో



## ఎమర్జెన్సీ పోరాట యోధుల్ని సదా స్మరించుకోవాలి

- 123వ 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ
- దేశంలో 95 కోట్ల మందికి సామాజిక రక్షణ

**జూన్ 29, ఢిల్లీ:** దేశంలో ఎమర్జెన్సీ విధించినవారు రాజ్యాంగాన్ని హత్య చేసి, న్యాయవిభాగాన్ని కీలుబొమ్మగా మార్చుకోవాలని అనుకున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. నాటి నిర్బంధంపై పోరాడిన యోధులను కచ్చితంగా స్మరించుకోవాలని, అది రాజ్యాంగాన్ని కాపాడుకోడానికి మనల్ని ప్రేరేపిస్తుందన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి 50 ఏళ్లు పూర్తవడాన్ని ఆదివారం నాటి 123వ 'మన్‌కీ

తరువాయి 2లో

## నేడు విజయవాడలో క్వాంటమ్ వ్యాలీపై వర్క్‌షాప్



- పాల్గొనేందుకు వచ్చిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులు
- ప్రముఖులకు సీఎం చంద్రబాబు విందు

**జూన్ 29, అమరావతి:** అమరావతి క్వాంటమ్ వ్యాలీపై సోమవారం విజయవాడలోని ఓ హోటల్‌లో రాష్ట్ర ప్రభుత్వం వర్క్‌షాప్ నిర్వహించనుంది. ఇందులో పాల్గొనేందుకు ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు పలువురు విజయవాడకు చేరుకున్నారు. సీఎం చంద్రబాబు ఉండవల్లిలోని తన నివాసంలో ఆది వారం రాత్రి వారికి విందు ఇచ్చారు. ఆయా కంపెనీల ప్రతినిధులతో క్వాంటమ్ వ్యాలీని అభివృద్ధి చేయడంపై చర్చించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ సహకారంతో దేశంలోనే మొదటి పార్కును ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని వివరించారు. టీసీఎస్ ప్రెసిడెంట్, గ్లోబల్ హెడ్ (టెక్నాలజీ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్) వి.రాజన్న,

తరువాయి 2లో

# ఎమర్జెన్సీ పోరాట యోధుల్ని సదా స్మరించుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

బాత్'లో ప్రధాని ప్రస్తావించారు. ఎమర్జెన్సీపై గళమెత్తిన మొరార్జీ దేశాయ్, వాజ్‌పేయి, బాబూ జగ్జీవన్‌రామ్‌ల ఆడియో ప్రసంగాలను కాసేపు వినిపించారు. భారత జనాభాలో దాదాపు 95 కోట్లమంది (64 శాతం) ఏదో ఒక సామాజిక రక్షణ పథకంతో లబ్ధి పొందుతున్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ తెలిపిందని మోదీ చెప్పారు. 2015 నాటికి సామాజిక రక్షణ ఫలాలు కేవలం 25 కోట్లమందికి అందేవని గుర్తు చేశారు. ఇటీవల అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని యావత్ ప్రపంచం జరుపుకొందని, అందరి జీవితాల్లో యోగా భాగమవుతోందని హర్షం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న శుభాంశు శుక్లాకు అభినందనలు తెలిపిన ప్రధాని.. భారతదేశం కొత్త చరిత్రను లిఖించిందన్నారు.

**యోగా దినోత్సవం ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంది**

ఈ ఏడాది అద్భుతంగా జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవం.. యోగాను తమ జీవితంలో అంతర్భాగంగా మార్చుకొనేలా మరింత మందికి కచ్చితంగా స్ఫూర్తినిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా చేసిన ప్రసంగంలో విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని మరోసారి గుర్తుచేసుకున్నారు. ''ఈ సారి కూడా జూన్ 21న దేశంతోపాటు, ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాలుపంచుకున్నారు. విశాఖపట్నంలో సముద్రం ఒడ్డున 3 లక్షల మంది ప్రజలు ఒకేసారి యోగా చేశారు. విశాఖపట్నం నుంచే మరో అద్భుతమైన దృశ్యం మనముందు కనిపించింది. తెలంగాణలో 3వేల మంది దివ్యాంగులు ఒకేచోట యోగాలో భాగస్వాములు అయ్యారు. సశక్తీకరణకు యోగా ఎలా మాధ్యమంగా మారిందన్న విషయాన్ని వారు ఆచరణలో చూపించారు. యోగాను తమ జీవితంలో అంతర్భాగంగా మార్చుకొనేలా మరింతమందికి కచ్చితంగా స్ఫూర్తినిస్తుంది'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ఉత్తరాదిని ముంచెత్తిన వానలు

(మొదటిపేజీ తరువాయి)

ఆ ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. ప్రమాద స్థలంలో మొత్తం 29 మంది ఉన్నారని, వీరిలో 20 మందిని రక్షించామని అధికారులు తెలిపారు.

**చార్‌ధామ్‌యాత్ర 24 గంటల నిలిపివేత**

వరదల కారణంగా చార్‌ధామ్ యాత్రను 24 గంటలపాటు అధికారులు నిలిపివేశారు. హరిద్వార్, రిషికేశ్, శ్రీనగర్, రుద్రప్రయాగ్, సోన్‌ప్రయాగ్, డెహ్రాడూన్, నైనీతాల్, తెహ్రీల్లో ఉన్న యాత్రికులను ముందుకువెళ్లకుండా ఆపాలని స్థానిక యంత్రాంగానికి సమాచారమందించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా యాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్లు గఢ్వాల్ డివిజన్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు. సోమవారం వాతావరణ పరిస్థితులను సమీక్షించిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

**పరీక్ష కోసం తెగించిన యువకులు**

రుద్రప్రయాగ్‌లోని బంగర్‌పట్టిలో 12 గ్రామాలను కలిపే మయాలీ రాందార్ రోడ్డుపై ఉన్న వంతెన తెగిపోవడం వల్ల అక్కడి జనజీవనం స్తంభించిపోయింది. ఈ క్రమంలో ప్రాంతీయ సివిల్ సర్వీస్(పీసీఎస్) పరీక్ష రాయడానికి అక్కడి యువకులు వారి ప్రాణాలకు తెగించి ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నదిని దాటి పెద్ద సాహసమే చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలయ్యింది. వికాస్‌ఖండ్ జకోలిలోని కుణాఘడ్ గదేరా వాగు పొంగిపొర్లడంతో పోంతి, మునియాఘర్‌ల మధ్య నిర్మించిన వంతెన తెగిపోయింది. దీంతో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**వరదలో చిక్కుకున్న 162 మంది విద్యార్థులు సురక్షితం**

ఝార్ఖండ్‌లోని తూర్పు సింగ్భూమ్ జిల్లాలో భారీ వర్షం కారణంగా వరద నీటిలో మునిగిన ఓ ఆశ్రమ పాఠశాల భవనంలో చిక్కుకున్న 162 మంది విద్యార్థులను స్థానికుల సాయంతో రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఈ నెల 1 నుంచి 28 వరకు రాష్ట్రంలో 80 శాతం అధిక వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు. పలు చోట్ల కొండచరియలు విరిగిపడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**రాబోయే వారం రోజులు భారీవర్షా లు: ఐఎండీ**

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రాబోయే వారం రోజులు పలు రాష్ట్రాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) హెచ్చరించింది. ఈ మేరకు ఐఎండీ ఆదివారం రెడ్ అలర్ట్ జారీచేసింది. చండీగఢ్‌లో ఒక్కరోజే 119.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది.

# నేడు విజయవాడలో క్వాంటమ్ వ్యాలీపై వర్క్‌షాప్

(మొదటిపేజీ తరువాయి)

మైక్రోసాఫ్ట్ ఇండియా ఎండీ రాజీవ్‌కుమార్, ఏటీ అండ్ టీ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ సిద్ధు, వార్నర్ బ్రదర్స్ ఇండియా ఇన్నోవేషన్ సెంటర్ హెడ్ మనీష్‌వర్మ, భారత్ బయోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర కె.ఎల్ల, హైదరాబాద్‌లోని అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, నేషనల్ క్వాంటమ్ మిషన్ డైరెక్టర్ జె.బి.వి.రెడ్డి, ఆస్ట్రాజెనెకా ఎండీ ప్రవీణ్‌రావు, ఐబీఎం ఇండియా వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్, కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ కార్యదర్శి అభయ్ కరాండికర్, కేంద్ర ప్రభుత్వ ప్రధాన శాస్త్రీయ సలహాదారు అజయ్‌కుమార్ సూద్ తదితర ప్రముఖులు ఈ విందుకు హాజరయ్యారు. వీరితో పాటు అమెజాన్, హెచ్‌సీఎల్, ఎల్అండ్‌టీ, ఐఐటీ మద్రాస్, ఐఐటీ తిరుపతి, బ్యాంక్ ఆఫ్ అమెరికా సంస్థల ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఒప్పందం కుదుర్చుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహును సమర్థిస్తూ మరోసారి ట్రంప్ పోస్టు పెట్టారు. నెతన్యాహుపై ప్రస్తుతం కొనసాగుతున్న రాజకీయ వేధింపులు గతంలో తనపైనా జరిగాయని అన్నారు. ''హమాస్‌తో ఒప్పందం కుదుర్చుకునే ప్రక్రియలో ఆయన (నెతన్యాహు) ఉన్నారు. బందీలను వెనక్కి తీసుకురావాలని చూస్తున్నారు. రోజంతా కోర్టులోనే ఉంటే అదెలా సాధ్యమవుతుంది'' అని పేర్కొన్నారు. నెతన్యాహుపై కేసులను రద్దు చేయాలని గత వారం కూడా ట్రంప్ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఉత్తర గాజాను ఖాళీ చేసి దక్షిణ గాజాలోని మువాసీ ప్రాంతానికి తరలివెళ్లాలని పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం ఆదేశించింది.

**హమాస్ సహ వ్యవస్థాపకుడు అల్-ఇస్సా హతం**

గాజాపై శుక్రవారం చేసిన దాడుల్లో హమాస్ సహ వ్యవస్థాపకుడు, సైనిక విభాగ కీలక నేత అయిన మహమ్మద్ ఇస్సా అల్ ఇస్సాను హతమార్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం(ఐడీఎఫ్) ప్రకటించింది. గాజాలోని సబ్రా ప్రాంతంలో జరిగిన వైమానిక దాడిలో అతడు మరణించినట్లు తెలిపింది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడికి అతడే ప్రణాళిక రచించి, అమలు చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది. టెల్ అవీవ్‌పై హమాస్ చేసిన మరిన్ని దాడుల్లో కూడా ఇస్సా

# మావోయిస్టుల అడ్డాగా రాష్ట్రాన్ని మార్చొద్దు

**నిజామాబాద్:** ఇందూరు (నిజామాబాద్)లో పండించిన పసుపును విదేశాలకు ఎగుమతి చేసి విశ్వవ్యాప్తం చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పారు. జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు ద్వారా రైతుల నాలుగు దశాబ్దాల కలను ప్రధాని మోదీ సాకారం చేశారన్నారు. మావోయిస్టులు ఆయుధాలు విడిచి జనజీవన స్రవంతిలో కలవాలంటూ హితవు పలికారు. 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని తుదముట్టిస్తామని పునరుద్ఘాటించారు. రాష్ట్రాన్ని మావోయిస్టులకు అడ్డాగా మార్చొద్దని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నిజామాబాద్‌లో ఆదివారం జాతీయ పసుపు బోర్డు కార్యాలయాన్ని అమిత్‌షా ప్రారంభించారు. అనంతరం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కిసాన్ మహా సమ్మేళన్ సభలో ఆయన ప్రసంగించారు. ''ఆయుధాలు చేతపట్టుకున్న వారితో చర్చలు జరపలేం. ఇది మా ప్రభుత్వ విధానం కాదు. వారు అడవుల్లో 40 వేల మంది ఆదివాసీలను హతమార్చారు. పోలీసులనూ చంపారు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఆయుధాల్ని విడిచి లొంగిపోవాలి. ఏడాదిన్నరలో 2 వేల మందికిపైగా జనజీవన స్రవంతిలో కలిశారు. మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కొందరు కాంగ్రెస్ నేతలు అంటున్నారు. మరి మావోయిస్టుల చేతిలో ప్రాణాలొదిలిన ఆదివాసీల కుటుంబాలకు మీరేం సమాధానం చెబుతారు? మావోయిస్టుల కారణంగా నిలిచిపోయిన అభివృద్ధి గురించి ఏం వివరణ ఇస్తారు?

**అవినీతి యథాతథం**

భారాస సర్కారు హయాంలో భారీ అవినీతి జరిగింది. ధరణి పోర్టల్, కాళేశ్వరం ప్రాజెక్టు, సింగరేణి, టీఎస్‌పీఎస్సీ తదితరాల్లో అవినీతి జరిగింది. కానీ, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. గతంలో కేసీఆర్‌కు, ఆయన కుటుంబానికి తెలంగాణ ఏటీఎంగా మారింది. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో దిల్లీకి ఏటీఎంగా తయారైంది. భారాస పోయి కాంగ్రెస్ వచ్చినా అవినీతి మాత్రం పోలేదు. తెలంగాణ యువత, దళితులు, మహిళలు, బడుగు బలహీనవర్గాలవారు డబుల్ ఇంజిన్ సర్కారు రావాలని కోరుకుంటున్నారు. రానున్న కాలంలో తెలంగాణలో భాజపా అధికారంలోకి వస్తుంది. 2024లో మోదీ ఇచ్చిన హామీ మేరకు నిజామాబాద్ గడ్డపై జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేశాం. పసుపు ప్యాకేజింగ్, మార్కెటింగ్, ఎగుమతులకు ప్రత్యేక వ్యవస్థలు నెలకొల్పుతాం. నిజామాబాద్‌లో భారత్ ఎక్స్‌పోర్ట్స్, భారత్ ఆర్గానిక్ లిమిటెడ్ శాఖలను ఏర్పాటు చేయనున్నాం. రైతులను అమెరికా, స్విట్జర్లాండ్, యూకే, ఆస్ట్రేలియా తదితర దేశాలకు పంపిస్తాం. వారు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించడమే మా లక్ష్యం.



పసుపు బోర్డు లోగోను ఆవిష్కరిస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా. చిత్రంలో సీతక్క, కిషన్‌రెడ్డి, అర్వింద్, తుమ్మల నాగేశ్వరరావు

**మోదీ పాలనలో దేశానికి రక్షణ**

గతంలో కాంగ్రెస్ పాలనలో పాకిస్థాన్ ఉగ్రవాదులు మన దేశంలో దాడులు చేసి పారిపోయేవారు. మోదీ హయాంలో ఆ పరిస్థితి లేదు. ఉరీలో సర్జికల్ స్ట్రైక్స్, పుల్వామాలో ఎయిర్ స్ట్రైక్స్, పహల్గాం ఘటన అనంతరం ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశాం. భారతీయులను ప్రశాంతంగా ఉండనీయబోమంటున్న పాకిస్థానీయుల ముఖాలు చూస్తే ఎవరికి ప్రశాంతత లేదో అర్థమవుతుంది. ఈ విషయాన్ని గ్రహించని రాహుల్ గాంధీ.. గత పదేళ్లుగా దేశాన్ని రక్షిస్తున్న మోదీని పదే పదే ప్రశ్నలు అడుగుతున్నారు'' అని అమిత్‌షా అన్నారు.

- **నిజామాబాద్‌లో కిసాన్ మహా సమ్మేళన్ సభకు హాజరైన రైతులు**
- **యూరియా కష్టాలను కేంద్రం**

**తీర్చింది: కిషన్‌రెడ్డి**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల పక్షపాతి అని అన్నారు. గతంలో ఎరువుల కొరతతో రైతులు అల్లాడేవారని, ఈ నేపథ్యంలో యూరియా కష్టాలు తీర్చేందుకు కేంద్రం రూ.3,500 బస్తాను రాయితీపై రూ.260కే అందిస్తోందని తెలిపారు. అయినా, తెలంగాణకు మోదీ ఏం ఇచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నిస్తున్నారని, కాంగ్రెస్‌కు సాధ్యం కాని పసుపు బోర్డును నిజామాబాద్ రైతులకు వరంగా మోదీ మంజూరు చేశారని ఆయన చెప్పారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు అర్వింద్‌గా మారారని చమత్కరించారు. తెలంగాణ ప్రజలు అందరికీ అవకాశం ఇచ్చారని, వచ్చే ఎన్నికల్లో భాజపాకు అవకాశం కల్పించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. అంతకుముందు అమిత్‌షా నిజామాబాద్ వినాయక్‌నగర్‌లోని జాతీయ పసుపు బోర్డు నూతన కార్యాలయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ అర్వింద్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం బస్వా గార్డెన్‌లో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కంఠేశ్వర్ బైపాస్ రోడ్‌లో మాజీ మంత్రి డి.శ్రీనివాస్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎంపీలు ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్, లక్ష్మణ్, జాతీయ పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, రాకేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కొమరయ్య, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేలూ.. తీరు మార్చుకోండి...

అమరావతి: పార్టీ సమావేశం కంటే.. ఇతర కార్యక్రమాలే ఎమ్మెల్యేలకు ఎక్కువయ్యాయా అని తెదేపా అధినేత చంద్రబాబు ఆగ్రహించారు. విస్తృత సమావేశాలకే రానివారు.. ఇక తమ నియోజకవర్గాలకు ఏం చేస్తారని మండిపడ్డారు. తరచూ విదేశీ పర్యటనలు పెట్టుకునేవారు ఇక అక్కడే ఉండడం మంచిదని చురకలేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో జరిగిన పార్టీ విస్తృతస్థాయి సమావేశానికి పలువురు ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. దీనిపై ఆరాతీయగా.. కొందరు విదేశీ పర్యటనల్లో ఉన్నారని, మరికొందరు దైవదర్శనాలకు వెళ్లారనే సమాధానం వచ్చింది. మొత్తంగా ఆహ్వానితుల్లో 56 మంది రాకపోవడం, వారిలో 15మంది ఎమ్మెల్యేలు విదేశాల్లో ఉండడంపైనా చంద్రబాబు అసహనం వెలిబుచ్చారు. ముగింపు ప్రసంగం సందర్భంగా ఆయన ఎమ్మెల్యేలు, ఎంపీలకు పలు అంశాలపై ఒకింత ఘాటు హెచ్చరికలు చేశారు. నియోజకవర్గాలకు దూరంగా ఉండడం సరికాదని, ఎమ్మెల్యేలు తమ తీరు మార్చుకోవాలని స్పష్టం చేశారు. ప్రజలతో మమేకమైతేనే భవిష్యత్తు ఉంటుందని గట్టిగా చెప్పారు. సమావేశానికి ఉదయం ఎంతమంది వచ్చారు? సంతకాలు పెట్టి ఎంతమంది వెళ్లిపోయారు? సమావేశం చివరివరకు ఎంతమంది ఉన్నారనే వివరాలు తన దగ్గర ఉన్నాయని చెప్పారు. తానా, ఆటా సమావేశాలకు వెళ్లేందుకు టికెట్లు బుక్ చేసుకున్న వారి వివరాలూ తమవద్ద ఉన్నాయని చంద్రబాబు చెప్పారు. ఇంటింటి ప్రచారం నేపథ్యంలో మంత్రులను సమీక్షల నుంచి మినహాయిస్తున్నామని, నెలరోజులూ నియోజకవర్గంలోనే ఉండాలని ఆదేశించారు.

- **ఎమ్మెల్యేలకు ఎందుకింత ఉదాసీనత?**

కొందరు ఎమ్మెల్యేల ఉదాసీన వైఖరిపై చంద్రబాబు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'కొంతమంది ఎమ్మెల్యేలు పాపులర్ అవుతున్నారు.. మరికొందరు పేరు తెచ్చుకోలేకపోతున్నారు. అయినా సమర్థించుకుంటున్నారు. సీరియస్‌గా పనిచేయట్లేదు. ఇవన్నీ ప్రజలు గమనిస్తారని గుర్తుంచుకోండి. నేనిచ్చిన సూచనలతో పనితీరు మార్చుకుంటే ఎమ్మెల్యేగా మళ్లీ గెలుస్తారు. లేదంటే మీ ఇష్టం.. అర్థం చేసుకుంటారనే స్పష్టంగా చెబుతున్నా. ఇక మొహమాటం ఉండదు' అని స్పష్టం చేశారు. 'క్షేత్రస్థాయిలో జనసేన, భాజపా శ్రేణులను సమన్వయం చేసుకోవాలి. నేను, పవన్‌కల్యాణ్ ఇచ్చిన పిలుపుతో ఓటు బదిలీ బాగా జరిగింది. ప్రతి నాయకుడు మూడు పార్టీలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలి' అని సూచించారు.

- **హాజరైన మంత్రులు, తెదేపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, నేతలు**

**అదీ లోకేశ్ పట్టుదల..**

'సరిగా పనిచేయలేని నాయకులకు పార్టీకి గట్టి పట్టున్న నియోజకవర్గం ఇస్తే దాన్ని చెడగొడతారు. ప్రజల్లో రాణించగలిగే నాయకులకు ఎలాంటి నియోజకవర్గం ఇచ్చినా.. తమకు అనుకూలంగా మలచుకుని విజయం సాధిస్తారు' అని చంద్రబాబు పేర్కొన్నారు. '2019 ఎన్నికల్లో విశాఖపట్నం నుంచి పోటీచేయాలని లోకేశ్‌కు చెప్పా. అయితే తాను మంగళగిరిలోనే పోటీచేస్తానని చెప్పారు. ఎన్నికలకు నెల ముందు అక్కడికి వెళ్లి పోటీచేసి కొద్దితేడాతో ఓటమిపాలయ్యారు. తర్వాత ఐదేళ్లూ అక్కడే కష్టపడ్డారు. రాష్ట్రంలోనే మూడో అతిపెద్ద మెజారిటీ సాధించారు. అదీ ఆయన పట్టుదల.. మొదటిసారి గెలిచిన వాళ్లు ఇలాగే పనిచేయాలి' అని సూచించారు.

- **పక్కనుండే నలుగురినే ప్రోత్సహిస్తే.. నష్టమే**

కొంతమంది ఎమ్మెల్యేలు తమ చుట్టూ ఉండే నలుగురినే ప్రోత్సహిస్తున్నారని.. ఇది వారితోపాటు పార్టీకి కూడా నష్టం కలిగిస్తుందని చంద్రబాబు సూచించారు. 'వరసగా మూడుసార్లు మెజారిటీ తక్కువ వచ్చిన బూత్‌లలో ఎక్కువసార్లు ప్రచారం చేయాలి. ఇది మంచి ఫలితం ఇస్తుంది. పాపులారిటీ రేటింగ్ రిపోర్టు కూడా ఎమ్మెల్యేలకు ఇస్తాం' అని చంద్రబాబు చెప్పారు.

# ఆ నాలుగు గ్రామాలను తెలంగాణలో కలపండి

(మొదటిపేజీ తరువాయి)

అమిత్‌షాను తుమ్మల కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. ''ఏపీ పునర్విభజన చట్టం 2014 కింద నాలుగు పంచాయతీలు, వాటి పరిధిలోని 17 రెవెన్యూ గ్రామాలను ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. దీనివల్ల పరిపాలనపరమైన సమస్యలే కాకుండా అభివృద్ధికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. భద్రాచలం పట్టణానికి, తెలంగాణలోని ప్రధాన మండలాల మధ్య రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. రెండు రాష్ట్రాల చెక్‌పోస్టుల వల్ల గిరిజనులకు, వాణిజ్య వాహనాలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. వామపక్ష తీవ్రవాద ప్రాంతం కావడం వల్ల శాంతిభద్రతల సమస్యలు ఏర్పడుతున్నాయి. భద్రాచలంలోని విద్యాసంస్థల్లో చదివే గిరిజన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దేవస్థానం భూములు ఏపీలో కలవడంతో ఆలయ నిర్వహణకు ఆటంకాలు కలుగుతున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించేందుకు నాలుగు పంచాయతీలను అత్యవసరంగా తెలంగాణలో కలపాలి.

- **పసుపు పంటకు మద్దతు ధర ప్రకటించాలి...**

పసుపు పంటకు కనీస మద్దతు ధర ప్రకటించాలి. కేంద్ర సంస్థల ద్వారా కొనుగోళ్లు చేపట్టాలి. డ్రైయింగ్ ప్లాట్‌ఫాంలు నిర్మించాలి. సాగు యాంత్రీకరణ, విలువ ఆధారిత గొలుసు అభివృద్ధిపై పరిశోధనలకు, భౌగోళిక సూచిక (జీఐ) ఆధారంగా తెలంగాణ పసుపును అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రాండ్ చేయడానికి కేంద్రం సహకారం అందించాలి. విలువ ఆధారిత, సేంద్రియ సాగు, అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలపై రైతులకు శిక్షణ ఇవ్వాలి. కూలీల కొరత నివారణకు యంత్రాలను అందుబాటులోకి తేవాలి. పంట అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు వ్యవసాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేయాలి'' అని తుమ్మల కోరారు.

# రామచందర్‌రావు, ఈటలలో ఒకరికి అవకాశం!

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శి సునీల్ బన్సల్ సోమవారం ఉదయం రానున్నారు. అధ్యక్ష ఎంపికలో కీలకమైన నామినేషన్ల ఘట్టం సోమవారం జరగనుంది. మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 4 వరకు భాజపా రాష్ట్ర కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఉంటుంది. నామినేషన్ వేసేది ఒకరేనని తెలిసింది.

**ఎవరి ధీమా వారిదే**

రాష్ట్ర అధ్యక్ష పదవికి మొదటి నుంచి నాలుగైదు పేర్లు వినిపించినా.. ఆదివారం పార్టీ వర్గాల్లో ఇద్దరి పేర్లపై ప్రధానంగా చర్చ జరిగింది. జాతీయ నాయకత్వం కొద్ది రోజుల క్రితమే తెలంగాణలోని ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, రాష్ట్ర ముఖ్య నేతల అభిప్రాయాలను తీసుకొన్నట్టు తెలిసింది. సంఘ్ నేతలు, పార్టీలో ఆది నుంచి ఉన్న సీనియర్ నేతలు పలువురు రామచందర్‌రావు పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. మరోవైపు ఈటల పేరు చాలా కాలంగా పరిశీలనలో ఉంది. బీసీ వర్గానికి అధ్యక్ష పదవిలో పార్టీ ప్రాధాన్యం ఇస్తుందన్న చర్చ నేపథ్యంలో అధిష్ఠానం బాధ్యతలు తనకే అప్పగిస్తుందని ఈటల గట్టి ధీమాతోనే ఉన్నారు. వీరిలో ఎవరి పేరును నాయకత్వం ప్రకటిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడి పేరు ప్రకటించాక పార్టీ శ్రేణులు సంబరాలు ఘనంగా చేయాలని పార్టీ నిర్ణయించింది. ఎన్నిక నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా మన్నెగూడలోని ఒక ఫంక్షన్ హాలులో ఆదివారం రాత్రి పార్టీ శ్రేణులు సన్నాహక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర భాజపా ఇంఛార్జ్ అభయ్‌పాటిల్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు జి.మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. జులై 1న ఎల్బీనగర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడి పేరును పార్టీ అధికారికంగా ప్రకటించనుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# పార్టీ శ్రేణులు ప్రజలతో మమేకం కావాలి

* **సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: మతోన్మాద కార్పొరేట్ రాజకీయ విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.స్థానిక మంచి కంటి భవన్ లో కొత్తగూడెం పట్టణ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు రెండవ రోజు పార్టీ నిర్మాణం పని పద్ధతులు అంశంపై క్లాసు బోధిస్తు ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాల ద్వారా పార్టీ విస్తరణ పెరుగుదల ఉంటుందని అన్నారు. ప్రజా సమస్యలపై ప్రజలను ఐక్యం చేయాలని మతం పేరుతో జరిగే విభజన రాజకీయాలకు వ్యతిరేకంగా ప్రజలను పోరాటాల్లోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. బిజెపి మతం పేరుతో ప్రజలను విభజించు పాలించు అనే బ్రిటిష్ విధానాన్ని అమలు చేస్తుందని విమర్శించారు. ప్రతి అంశాన్ని మత రంగు పులిమి తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకుంటు ప్రజల మధ్య చీలికలు తెస్తున్నారని దుయ్యబట్టారు.దేశ సంపదను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతూ పేద మధ్యతరగతి ప్రజలపై భారాలు మోపుతున్నారని విమర్శించారు.ప్రస్తుత రాజకీయాలు వ్యాపారం అయిపోయిన సందర్భంలో కుల మత రాజకీయాలు ముందుకు వస్తున్న నేపథ్యంలో స్వచ్ఛమైన రాజకీయాలు పట్ల ప్రజలకు విశ్వాసం కల్పించడానికి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని రాజకీయాలలో విలువలు బతికే ఉన్నాయని నమ్మకం ప్రజలకు కల్పించాలని రాజకీయాలలో విలువలకు నిలువటద్దంగా కమ్యూనిస్టు పార్టీలు ఉన్నాయి అనే విశ్వాసానికి రేకెత్తించాలని తెలియజేశారూ.వర్గ పోరాటాలకు ఆటంకంగా ఉన్న మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా శ్రామిక వర్గాన్ని ఐక్యం చేయాల్సిన బాధ్యత వారిలో మతోన్మాదానికి వ్యతిరేకంగా




సైద్ధాంతిక అవగాహనను పెంపొందించాల్సిన బాధ్యత కమ్యూనిస్టులపై ఉందని గుర్తు చేశారు. మత రాజకీయాలపై ప్రజలను విభజించాలని చూస్తున్న వారికి ప్రజా సమస్యలను తీసుకొని పోరాటాల ద్వారా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. స్థానిక సమస్యలపై పోరాటాల చేస్తూ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదలకు అందేలా పోరాటాలు చేయాలనిపిలుపునిచ్చారు. ఇందిరమ్మ ఇళ్లు ప్రచార అర్భాటమే తప్ప ఆచరణ కనపడట్లేదు ఆరోపించారు.కొత్తగూడెంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ కార్యదర్శి లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, టౌన్ కార్యదర్శి వర్గ సభ్యులు సందకూరి లక్ష్మి, నందిపాటి రమేష్ ,నాయకులు ఆలేటి శ్రీను, అన్నవరపు ఇందిరా, పప్పుల ప్రమోద్, యన్ ఎస్ రాజు, వాణి, గడల నరసింహారావు, పద్మ ,రజిత, మహేశ్వరి, బాలకృష్ణ, రాములు, రఘు ,నాగదుర్గ, సంధ్య ,తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో
# కోట్లాది రూపాయలతో అభివృద్ధి పరిచాం

* **బిఆర్ఎస్ పార్టీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : గత పదేళ్ళ కాలంలో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో కోట్లాది రూపాయలను వెచ్చించి అభివృద్ధి పరిచామని బిఆర్ఎస్ పార్టీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల డివిజన్ బృందావన్ కాలనీలో రూ.91 లక్షలతో అభివృద్ధిచేసిన పార్కును ఆయన పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ శివారు ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి, నూతన కాలనీలలో మౌలిక వసతులకు అభివృద్ధిలో భాగంగా బృందావన్ కాలనీలో మిషన్ భగీరథ ద్వారా మంజీరా నీటి సదుపాయం, వీధి దీపాలతో పాటు పార్కు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. చేసిన అభివృద్ధిని చూసి కుత్బుల్లాపూర్ ప్రజలు 2023 లో జరిగిన ఎన్నికల్లో 85576 ఓట్ల భారీ మెజార్టీతో అఖండ విజయాన్ని అందించారన్నారు.నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు తాను ఎప్పుడూ సిద్ధమేనని అన్నారు. కాలనీ వాసులంతా ఐకమత్యంగా ఉన్నపుడే అభివృద్ధి సాధ్యమని, బృందావన్ కాలనీ అభివృద్ధి నా బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ తారా చంద్రా రెడ్డి, బృందావన్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రవి గౌడ్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రమణకుమార్ రాజు, కోశాధికారి జోగారావు, సంయుక్త కార్యదర్శి నవీన్, కార్యనిర్వాహక కార్యదర్శి వంశీ, సలహాదారులు రాజేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు రమేష్, శ్రీనివాస్, విశ్వనాథం, జిలాని, రిత్విక్ రాజశేఖర్, కేఎస్ఆర్ సురేంద్ర, రాజేష్, సత్తి కోడా, హరికృష్ణ, ఫెరోజ్, రవీందర్ రెడ్డి, మహేష్, శ్రీకాంత్, కార్తీక్, మురళీ, సుబ్బయ్య, సతీష్, ప్రవీణ్, వినీష్, చంద్ర, రాజు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, సుధాకర్ గౌడ్, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఎల్లా గౌడ్, తోకల నగేష్, మాధవ్ రెడ్డి, నదీమ్ రాయ్, యేసు, కాలే గణేష్, బాల మల్లేష్, శ్రీకాంత్, విజయ్ హరీష్, మహిళా నాయకురాలు శ్రీదేవి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సహజ వనరులైన సౌర విద్యుత్ ను వినియోగించుకోవాలి

* **ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : సహజ వనరులైన సౌరవిద్యుత్ ను అందరూ వినియోగించుకోవడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ లు అన్నారు. ఆదివారం కొంపల్లిలో నూతనంగా ఏర్పాటుచేసిన క్రిసోల్ సోలార్ ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి జోగు రామన్న లు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహజవనరులైన సోలార్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మాజీ ఎంపీపీ సన్న కవితా శ్రీశైలం యాదవ్, పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, సూరారం డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, జీడిమెట్ల డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఆఫ్ ఆర్థిక సహాయం నిరుపేదలకు వరంగా మారింది

* **కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి): సిఎంఆర్ఆఫ్ ఆర్థిక సహాయం నిరుపేదలకు వరంగా మారిందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం గాజులరామారంలో శ్రీ శ్రీ చిత్తరమ్మ దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులు కొండడి యాదవ రావు కు రూ. 60,000 లు, కడలి సత్యనారాయణ కు రూ. 37,500లు, భల్లం ఉషారాణి కి రూ.35,000లు , బి.విజయరామ రాజు కు రూ. 32,500లు, బి.విట్టల్ కు రూ.60,000ల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలన ద్వారా బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తుందన్నారు. నియోజకవర్గ ప్రజలు ప్రభుత్వ సంక్షేమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో లబ్దిదారులు, నియోజకవర్గం ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గం ప్రజలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకొని.. పలు ఆహ్వానాలు,వినతిపత్రాలను స్వీకరించారు.

## నా రాజకీయ గురువు 'డీఎస్'

నా రాజకీయ గురువు మాజీ పీసీసీ అధ్యక్షులు డి.శ్రీనివాస్ అని, ఆయన వద్ద రాజకీయ ఓనమాలు నేర్చుకున్నానని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. మాజీ పీసీసీ అధ్యక్షులు డి.శ్రీనివాస్ మొదటి వర్ధంతి సందర్భంగా ఆదివారం గాంధీ భవన్‌లో డి.శ్రీనివాస్ చిత్ర పటానికిటీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నేడు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చొరవతో నిజామాబాద్ లో డి.శ్రీనివాస్ విగ్రహావిష్కరణ జరుగుతోందన్నారు. విగ్రహావిష్కరణకు కాంగ్రెస్ నేతలకు ఆహ్వానం లేకపోవడం బాధాకరం అన్నారు. శ్రీనివాస్ గారు జీవితాంతం కాంగ్రెస్ పార్టీ ఊపిరిగా జీవించారని తెలిపారు. ఆయన పార్టీకి చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పీషరీస్‌చైర్మన్‌మెట్టు సాయికుమార్, ఖైరతబాద్‌నేత రోహిణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ప్రాణాలు పోతున్న ఎవరికి పట్టింపు లేదా..?

* **నడిరోడ్డుపై పశువుల సంచారంతో ప్రమాదాలు**
* **పశువులను గోశాలకు తరలించాలని విజ్ఞప్తి**





ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నడి రోడ్డుపైన పశువులు తిష్టవేయడంతో వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. రాత్రి సమయంలో రాష్ట్ర, జాతీయ రహదారులపైన సెంట్రల్ లైటింగ్ ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో ఆ లైట్లు వెలగకపోవడం వల్ల నడి రోడ్డుపై పడుకుని ఉన్న పశువుల్ని గుర్తించలేక వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. జిల్లా కేంద్రమైనప్పటికీ ఇక్కడ నిత్యం వందలాది పశువులు రోడ్లపైనే సంచరిస్తూ వాహనదారులను ముప్పు తిప్పలు పెడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. కొత్తగూడెం - విజయవాడ జాతీయ రహదారి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో సెంట్రల్ లైటింగ్ రామవరం 14 నెంబర్ వరకు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత విజయవాడ వెళ్లే ప్రధాన రహదారి రుద్రంపూర్, పెనగడప వరకు అంధకారం నెలకొంటుంది. అంతే కాకకొత్తగూడెం -ఖమ్మం,కొత్తగూడెం -భద్రాచలం రహదారులపైన కూడా పశువులు రోడ్డుపైనే సంచరించడం, పడుకోవడం వల్ల వాహనదారులు వాటిని ఢీకొట్టి కిందపడుతున్నారు. ముఖ్యంగా విద్యానగర్ కాలనీ, ఇల్లందు, పాల్వంచ, భద్రాచలం వైపు వెళ్లే రహదారులతోపాటు రామవరం, సూపర్‌బజార్, గణేష్‌టెంపుల్, బాబుక్యాంప్, పాత బస్‌డిపోల వద్ద రోడ్లపైనే పశువులు విరివిగా కన్పిస్తున్నాయి.

* **హెచ్చరిక బోర్డులతో చేతులు దులుపుకున్న మున్సిపల్ అధికారులు**

2020లో జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన చౌరస్తాలలో కొత్తగూడెం మున్సిపల్ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. బ్యానర్‌లో 'రహదారులు, వీధులలో సంచరించే ఆవులు, గేదెలు, కుక్కలు, పందులను బందెలదోడ్లు, గోశాలలకు, ఊరిబయట ప్రదేశాలకు తరలించబడును మరియు వాటి యజమానులకు రూ.5000/- వరకు జరిమాన విధించబడును. కావున సంభందిత యజమానులు పెంపుడు జంతువులను తమ ఆధీనములో ఉంచుకోగలరు. ఇట్లు: కమీషనర్, పురపాలక సంఘం, కొత్తగూడెం' అని బ్యానర్లు ఏర్పాటు చేశారు. కాని ఆ హెచ్చరికలు బ్యానర్లకే పరిమితమయ్యాయి. గడిచిన ఐదేళ్లలో రోడ్లపై సంచరిస్తున్న పశువులను బందెలదొడ్డి, గోశాలలకు తరలించిన దాఖలాలు కన్పించడంలేదు. అదేవిధంగా పశువుల యజమానులను గుర్తించి, వారికి జరిమానాలు విధించిన సందర్భాలు కూడా లేవనే చెప్పాలి. ఫలితంగా రోడ్లపైకి పశువులను కొందరు విచ్చలవిడిగా వదిలేస్తున్న కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతోపాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మరి ఇప్పటికైనా అధికారులు కళ్లుతెరిచి రోడ్లపైకి వచ్చిన పశువులను పట్టుకుని బందెలదొడ్లకు లేదా గోశాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులోనూ ఈ విధంగా పశువులను రోడ్లపైకి విడిచిపెట్టకుండా పశువుల యజమానులకు భారీగా జరిమానాలు విధించాలని వాహనదారులు కోరుతున్నారు.


## కుత్బుల్లాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి నూతన కార్యవర్గం సహకరించాలి

* **కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**




కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కుత్బుల్లాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి నూతన కార్యవర్గం సహకరించాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే , కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. ఆదివారం గాజులరామారంలోని సత్యగౌరి కన్వెన్షన్ లో ఏర్పాటు చేసిన కుత్బుల్లాపూర్ మండల ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణస్వీకార మహోత్సవంలో ఆయన ముఖ్యతిధిగా పాల్గొన్నారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2010 లో జగద్గిరిగుట్ట ఆర్యవైశ్య సంఘానికి 2000 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఇప్పిచ్చానని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వాస శ్రీనివాసులు గుప్త, కార్యదర్శి దారం ఇంద్రాసేన గుప్త, కోశాధికారి సోమిశెట్టి పవన్ కుమార్ గుప్త, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బి.రమేష్ గుప్త , జగద్గిరిగుట్ట, షాపూర్ నగర్, సూరారం, గాజులరామారం, చింతల్, సుచిత్ర, సుభాష్ నగర్ ఆర్యవైశ్య సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

## తెలంగాణలో భారీ వర్షం



తెలంగాణ లో నైరుతి ఋతుపవనాలు నెమ్మదిగా వేగం పుంజుకుంటున్నాయి. ఈ క్రమంలో నేడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసాయి. ఖమ్మం, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, రంగారెడ్డి, నిర్మల్ లో అతి భారీ వర్షం కురిసింది. అదే విధంగా కరీంనగర్, హనుమకొండ, కొత్తగూడెంలలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కాగా ఈ వర్షాలు మరో మూడు రోజులు కొనసాగనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా వానాకాలం మొదలై జూన్ నెల ముగుస్తున్న సరైన వర్షాలు లేక ఎదురు చూపులు చూస్తున్న రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# వాళ్లిద్దరికీ తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ జరగడం అసాధ్యం


* కేసీఆర్, కేటీఆర్‌ల ప్రమేయం లేకుండా ఫోన్ ట్యాపింగ్ జరగదన్న టీపీసీసీ చీఫ్
* మహా న్యూస్ పై బీఆర్ఎస్ కార్యకర్తల దాడిని తీవ్రంగా ఖండన
* సినీ ప్రముఖులు, జడ్జిల ఫోన్లను ఎందుకు ట్యాప్ చేయాల్సి వచ్చింది? అంటూ ప్రశ్న
* మహిళల ఫోన్లు ట్యాప్ చేసి వారి కుటుంబాల్లో చిచ్చుపెట్టారని ఆగ్రహం





* అభ్యంతరాలుంటే దాడులు కాదు, చట్టపరంగా ముందుకెళ్లాలని హితవు

తెలంగాణను కుదిపేస్తున్న ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న వేళ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లకు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ జరగడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై స్పందిస్తూ, ఒక మీడియా ఛానల్‌పై బీఆర్ఎస్ శ్రేణులు చేసిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. వివిధ వర్గాల ఫోన్లను ట్యాప్ చేయడంపై మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "రాజకీయ నేతలే లక్ష్యమైతే, వారి కుటుంబ సభ్యులైన మహిళల ఫోన్లను ఎందుకు ట్యాప్ చేశారు?" అని ఆయన సూటిగా ప్రశ్నించారు. కేవలం రాజకీయ ప్రత్యర్థులే కాకుండా, సినీ తారలు, న్యాయమూర్తులు, మహిళా అధికారుల ఫోన్లను కూడా ట్యాప్ చేశారని ఆయన ఆరోపించారు. ఈ చర్యల వల్ల ఎంతో మంది కుటుంబాల్లో లేనిపోని చిచ్చు పెట్టారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సినీ ప్రముఖుల వ్యక్తిగత సంభాషణలను దొంగచాటుగా వినాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. ఏదైనా విషయంపై అభ్యంతరాలు ఉంటే, ప్రజాస్వామ్యంలో చట్టపరంగా పోరాడాలని, అంతేగానీ మీడియా సంస్థలపై భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని మహేశ్ కుమార్ గౌడ్ హితవు పలికారు. బీఆర్ఎస్ నాయకత్వం ఇటువంటి దాడులను ప్రోత్సహించవద్దని, చట్టపరమైన మార్గాలను అనుసరించాలని సూచించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిజానిజాలు విచారణలో తేలతాయని, బాధ్యులెవరైనా చట్టం ముందు నిలబడాల్సిందేనని ఆయన అన్నారు.



## మెగా డీఎస్సీ.. జులై 1, 2 తేదీల్లో పరీక్షకు కొత్త హాల్ టికెట్లు

అమరావతి: జులై 1, 2 తేదీల్లో డీఎస్సీ పరీక్షలు రాసే అభ్యర్థులు apdsc.apcfss.in సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఏపీ పాఠశాల విద్యాశాఖ సూచించింది. యోగా దినోత్సం సందర్భంగా జూన్ 20, 21 తేదీల్లో నిర్వహించాల్సిన మెగా డీఎస్సీ 2025 నియామక పరీక్షలను అధికారులు వాయిదా వేశారు. జూలై 1, 2 తేదీల్లో జరిగే పరీక్షా కేంద్రాలు, పరీక్ష తేదీలను మార్చిన కొత్త హాల్ టికెట్లను అధికారులు మంజూరు చేస్తున్నారు. కొత్త హాల్ టికెట్లలో పరీక్షా కేంద్రాలు, పరీక్ష తేదీలు నిర్ధారించుకుని హాజరు కావాలని అధికారులు సూచించారు. ఇవాళ జరిగిన ప్రిన్సిపల్ పరీక్షకు, స్కూల్ అసిస్టెంట్ తెలుగు పరీక్షకు 19,750 మంది అభ్యర్థులకు గాను 18,231 మంది హాజరయ్యారని అధికారులు వెల్లడించారు. చిత్తూరు జిల్లాలో 97.81శాతం, నెల్లూరు జిల్లాలో 88.04 శాతం అత్యధికంగా హాజరు నమోదైందని తెలిపారు.

## మమ్మల్ని పట్టుకోలేరు... బీజేపీ ఎంపీ రఘునందన్ కు మరోసారి బెదిరింపులు


* బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి బెదిరింపు కాల్స్
* 'ఆపరేషన్ కగార్' ఆపాలంటూ ఆగంతకుల డిమాండ్
* ఏపీ మావోయిస్టు కమిటీ పేరుతో ఇంటర్నెట్ ద్వారా ఫోన్లు
* హైదరాబాద్‌లోనే ఐదు బృందాలున్నాయని హెచ్చరిక
* ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఘటన.. పోలీసులకు ఫిర్యాదు
* కొద్ది రోజుల క్రితమే ఓసారి హెచ్చరికలు.. అదనపు భద్రత ఏర్పాటు



తెలంగాణ బీజేపీ ఎంపీ రఘునందన్‌రావుకు బెదిరింపుల పర్వం కొనసాగుతోంది. ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో విశ్రాంతి తీసుకుంటున్న ఆయనకు, మరోసారి ప్రాణహాని తలపెడతామంటూ మరోసారి హెచ్చరికలు వచ్చాయి. ఆదివారం రెండు వేర్వేరు ఫోన్ నంబర్ల నుంచి కాల్స్ చేసిన ఆగంతకులు, ఛత్తీస్ గఢ్ లో 'ఆపరేషన్ కగార్'ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తాము ఏపీ మావోయిస్టు కమిటీకి చెందిన వారిమని, తమ ఆదేశాల మేరకు ఐదు ప్రత్యేక బృందాలు ఇప్పటికే హైదరాబాద్‌లో రంగంలోకి దిగాయని వారు చెప్పినట్టు సమాచారం. "మా టీమ్‌లు నగరంలోనే ఉన్నాయి. మరికాసేపట్లోనే నిన్ను చంపేస్తాం. దమ్ముంటే నిన్ను నువ్వు కాపాడుకో" అంటూ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. పోలీసులు తమ ఫోన్లను ట్రేస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నా తమ ఆచూకీ దొరకదని, ఎందుకంటే తాము ఇంటర్నెట్ కాల్స్ ఉపయోగిస్తున్నామని ఆ వ్యక్తులు స్పష్టం చేశారు. ఏ పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని వారు తేల్చిచెప్పినట్లు తెలిసింది. రఘునందన్‌రావుకు ఇలాంటి బెదిరింపులు రావడం ఇది రెండోసారి. గత జూన్ 23న తొలిసారిగా ఆయనకు బెదిరింపు కాల్ వచ్చింది. ఆ సమయంలోనే ఆయన రాష్ట్ర డీజీపీతో పాటు మెదక్, సంగారెడ్డి ఎస్పీలకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం ఆయనకు భద్రతను పెంచి, ఎస్కార్ట్ వాహనంతో పాటు అదనపు సిబ్బందిని కేటాయించింది. అయినప్పటికీ బెదిరింపులు ఆగకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రెండు రోజుల క్రితమే కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న రఘునందన్‌రావు, ప్రస్తుతం ఆసుపత్రిలోనే కోలుకుంటున్నారు. ఈ క్రమంలోనే తాజా బెదిరింపులు రావడంతో ఆయన ఆసుపత్రి నుంచే మరోమారు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ ప్రారంభించారు.

## స్టాఫ్ నర్సుపై కేసు .. నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం

నెల్లూరు: మరో స్టాఫ్‌నర్సు ఆత్మాహత్యాయత్నం చేసిన ఘటన నెల్లూరు జిల్లా ఏఎస్ పేట ప్రభుత్వాసుపత్రిలో చోటు చేసుకుంది. స్టాఫ్ నర్స్ తోట లక్ష్మి నిద్రమాత్రలు మింగారు. లక్ష్మి వేధిస్తుందంటూ శనివారం ఇదే ఆస్పత్రిలో దొరసానమ్మ అనే నర్సు ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో పోలీసులు లక్ష్మిపై కేసు నమోదు చేశారు. తనపై కేసు నమోదు కావడంతో ఆదివారం లక్ష్మి ఆత్మహత్యకు యత్నించారు. సమచారం తెలుసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## రాగల 3 రోజులు ఉత్తర కోస్తా, యానాంలో వర్షా లు

అమరావతి: రాష్ట్రంలో రాబోయే 3 రోజులు వాతావరణ పరిస్థితులను అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దక్షిణ రాజస్థాన్, ఉత్తర గుజరాత్ మీదుగా ఉపరితల ఆవర్తనం నుంచి వాయువ్య బంగాళాఖాతం వరకు తూర్పుపశ్చిమ ద్రోణి కొనసాగనుంది. మధ్యప్రదేశ్, ఉత్తర ఛత్తీస్‌గఢ్, ఉత్తర ఒడిశా మీదుగా అల్పపీడన ప్రాంతంతో సంబంధం ఉన్న ఉపరితల ఆవర్తనం వరకు ఈ ద్రోణి కొనసాగనుంది. సగటు సముద్ర మట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల మధ్య విస్తరించి ఎత్తుకు వెళ్లేకొలది దక్షిణ దిశగా ద్రోణి వంగి ఉన్నట్లు అమరావతి వాతావరణ కేంద్రం



అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణలో పశ్చిమ గాలులు వీయనున్నాయి. ఉత్తర కోస్తా, యానాంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. ఈదురు గాలులు గంటకు 4050 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దక్షిణ కోస్తా, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములతో కూడిన జల్లులు ఒకట్రెండుచోట్ల కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.


## ఎస్వీ విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళం

తిరుమల: చెన్నైకు చెందిన టీవీఎస్ క్యాపిటల్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తితిదే ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న శ్రీవేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు రూ.51 లక్షలు విరాళంగా అందించింది. విరాళం చెక్కును సంస్థ సీఎండీ గోపాల్ శ్రీనివాసన్ తిరుమలలో తితిదే అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు.



## కేసీఆర్ అంటేనే ఉద్యమం, అభివృద్ధి : హరీష్ రావు

కేసీఆర్ లేకపోతే తెలంగాణ ఆనవాళ్లు లేనట్టేనని బీఆర్ఎస్ నాయకుడు, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలోని అమరచింతలో నేడు తెలంగాణ మలిదశ ఉద్యమ కళాకారుడు సాయిచంద్ రెండవ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సభలో హరీష్‌రావు పాల్గొన్నారు. అమరచింత కొత్త బస్టాండ్ ఆవరణలో సాయిచంద్ ఏడు అడుగుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. హరీష్ రావు తన ప్రసంగంలో సాయిచంద్ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని,



రాష్ట్ర సాధన కోసం జైలుకు వెళ్లారని గుర్తు చేశారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శిస్తూ, "రేవంత్ రెడ్డి ఒక్కసారైనా 'జై తెలంగాణ' అన్నారా?" అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కేసీఆర్ ఆనవాళ్లను తొలగించే ప్రయత్నం చేస్తోందని, కానీ కేసీఆర్ లేకపోతే తెలంగాణ ఆనవాళ్లు లేనట్టేనని ఆయన అన్నారు. హరీష్ రావు కేసీఆర్‌ను తెలంగాణ ఉద్యమం, అభివృద్ధి, సంక్షేమానికి ప్రతీకగా అభివర్ణించారు, ఆయన నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్రం సాధించిన విజయాలను, సంక్షేమ పథకాలను కొనియాడారు. ఈ సభలో సాయిచంద్‌ను స్మరిస్తూ, ఆయన తెలంగాణ ఉద్యమంలో చేసిన కృషిని కొనియాడారు.

## గోదావరి-బనకచర్లపై మంగళవారం పీపీటీ

ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన గోదావరి బనకచర్లపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించాలని నిర్ణయించింది. రాష్ట్ర ప్రజాప్రతినిధులందరికీ నిజనిజాలు తెలిపేలా ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అందుకు అనుగుణంగా ఆయన నీటిపారుదల రంగ అధికారులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహించి ఈ ప్రాజెక్టు నిర్మించడం వల్ల రాష్ట్ర ప్రయోజనాలు ఏ రకంగా దెబ్బతింటాయో సమగ్రంగా వివరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. డాక్టర్ జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్న ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌కు ముఖ్యఅతిథులుగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం హాజరుకానుంది. అంతేకాకుండా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు, శాసన మండలి, శాసనసభ్యులతోపాటు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ విభాగాలకు చెందిన కమిషన్ల చైర్మన్లు, సభ్యులు పాల్గొననున్నారు.



# హింస తగ్గుముఖం..! డ్రగ్స్‌పై ఉక్కుపాదం..

జాతుల మధ్య ఘర్షణలతో అట్టుడికిన మణిపూర్ లో రాష్ట్రపతి పాలన అనంతరం శాంతిభద్రతలు మెరుగుపడు తున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరిలో రాష్ట్రపతి పాలన మొదలు.. రాష్ట్రంలో హింసాత్మక ఘటనలు, పౌర మరణాలు తగ్గినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా.. మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. మరోవైపు.. ఆయుధాగారాల నుంచి లూటీ అయిన వేలాది తుపాకులను భద్రత బలగాలు స్వాధీనం చేసుకునే పనిలో పడ్డాయి. సీఎం బీరెన్‌సింగ్ రాజీనామా, తదనంతర పరిణామాల నేపథ్యంలో.. మణిపూర్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 13న రాష్ట్రపతి పాలన విధించారు. అప్పటినుంచి పరిస్థితిలో చాలా మార్పు వచ్చిందని అధికారులు తెలిపారు. రాష్ట్రపతి పాలనకు ముందు 17 వేలకుపైగా దహనం, విధ్వంసం సంబంధిత ఘటనలు నమోదు కాగా.. ఆ తర్వాత ఒక్కటీ చోటుచేసుకోకపోవడం గమనార్హం. మాదకద్రవ్యాలపై మణిపూర్ పోలీసు యంత్రాంగం, అస్సాం రైఫిల్స్, ఇతర పారామిలిటరీ బలగాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. ఇప్పటివరకు 460 కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయి. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం కింద ఇప్పటివరకు 84 మంది అరెస్టయ్యారు. దోపిడీ కేసుల్లోనూ గత నాలుగు నెలల్లో 336 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. లూటీకి గురైన ఆయుధాల సమస్య భద్రత సిబ్బందికి సవాలుగా మారింది. రాష్ట్రపతి పాలన విధించినప్పటి నుంచి.. కొత్తగా ఆయుధాలను ఎత్తుకెళ్లిన ఘటనలేవీ నమోదు కాలేదు. అంతకుముందు 6,020 తుపాకులు లూటీ కాగా.. వాటిలో చాలావరకు వెనక్కి వచ్చేశాయి. గత నాలుగు నెలల్లో 2,390 ఆయుధాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా.. ఇటీవల 63 అక్రమ బంకర్లను కూల్చివేశారు.





## 90 డిగ్రీల వంతెన.. ఏడుగురు ఇంజినీర్ల సస్పెన్షన్

మధ్యప్రదేశ్‌లో ఇటీవల నిర్మించిన ఓ రైల్వే వంతెన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఆ వంతెన 90 డిగ్రీల మలుపుతో నిర్మించడమే అందుకు కారణం. దీనికి సంబంధించి మీడియాలో అనేక కథనాలు రావడంతోపాటు సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం జరిగింది. ఇలాంటి డిజైన్‌లను రూపొందించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం తాజాగా ఏడుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు విధించింది. మరో విశ్రాంత చీఫ్ ఇంజినీర్‌పై శాఖాపరమైన విచారణకు ఆదేశించింది. ''ఐష్‌బాగ్‌లో ఆర్‌వోబీ నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యంపై దర్యాప్తునకు ఆదేశించా. నివేదిక ఆధారంగా ఎనిమిది మంది పీడబ్ల్యూడీ ఇంజినీర్లపై చర్యలు తీసుకున్నా. ఇందులో ఏడుగురు ఇంజినీర్లపై తక్షణమే సస్పెన్షన్ విధించా. నిర్మాణ ఏజెన్సీ, డిజైన్ రూపొందించిన కన్సల్టెంట్‌లను బ్లాక్‌లిస్టులో చేర్చాం. ఆర్వోబీ పునరుద్ధరణ కోసం ఓ కమిటీని ఏర్పాటు చేశాం'' అని ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ వెల్లడించారు. రాజధాని భోపాల్‌లో ఐష్‌బాగ్ వద్ద రూ.18 కోట్లతో ఇటీవల కొత్తగా ఓ రైల్వే వంతెన నిర్మించారు. అయితే, అది 90 డిగ్రీల మలుపు కలిగి ఉండటం తీవ్ర విమర్శలకు దారితీసింది. నిర్మాణ సంస్థ మాత్రం ఆ డిజైన్‌ను సమర్థించుకుంది. సమీపంలో మెట్రో రైల్ స్టేషన్, భూమి కొరత దృష్ట్యా ఇలా నిర్మించడం తప్పితే మరో మార్గం లేదని వివరణ ఇచ్చింది. కొంచెం అదనపు భూమి అందుబాటులో ఉంటే ఆ మార్గం సవ్యంగానే ఉండేదని చెప్పింది. అయినప్పటికీ తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం చర్యలు తీసుకుంది.




## ఎయిరిండియా విమానంలో సాంకేతిక లోపం.. దారి మళ్లింపు

కోల్‌కతా: ఎయిరిండియా విమానంలో మరోసారి సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో టోక్యో నుంచి ఢిల్లీ రావాల్సిన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానాన్ని దారి మళ్లించి.. కోల్‌కతా విమానాశ్రయంలో ల్యాండింగ్ చేశారు. విమాన కేబిన్‌లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరిగిపోవడంతో అప్రమత్తమైన పైలట్ కోల్‌కతా విమానాశ్రయ అధికారు లకు సమాచారమిచ్చి.. సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. ఈ మేరకు ఎయిరిండియా ఓ ప్రకటన విడుదల చేసింది. '' టోక్యోలోని హనేడా నుంచి ఢిల్లీ ప్రయాణిస్తున్న ఏఐ 357 విమానంలో లోపం తలెత్తడంతో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా కోల్ కతా విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశాం. ప్రస్తుతం తనిఖీలు కొనసాగుతున్నాయి'' అని ప్రకటనలో పేర్కొంది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, వారిని ఢిల్లీ చేర్చేందుకు వీలుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేస్తున్నామని వెల్లడించింది.

## జనాభా లెక్కల తొలి దశ.. 2026 ఏప్రిల్ 1 నుంచి షురూ

రాబోయే జనాభా లెక్కల కోసం హౌస్ లిస్టింగ్ కార్యకలాపాలు 2026 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతాయని సెన్సస్ కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు ఆదివారం ఓ లేఖ రాశారు. గృహ గణన ప్రక్రియ మొదటి దశ జనాభా లెక్కల ప్రారంభాన్ని సూచిస్తాయని పేర్కొన్నారు. దీనికి ముందు సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామకం జరుగుతుందని, వారికి పనిని షేర్ చేయడంతో పాటు రాష్ట్రాలు, జిల్లా పరిపాలనా విభాగాల సహకారంతో గణన కొనసాగుతుందని వెల్లడించారు. ఈ సర్వేలో ఫోన్, ఇంటర్నెట్, వాహనాలు (సైకిల్, బైక్, కారు, జీప్, వ్యాన్), ఉపకరణాలు (రేడియో, టీవీ, ట్రాన్సిస్టర్) వంటి వివరాలు సేకరిస్తారు.

### త్రిభాషా విధానం..
## వెనక్కి తగ్గిన మహారాష్ట్ర సర్కారు...

ముంబయి: ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు పిల్లలందరికీ హిందీ విధిగా బోధించాలని ఇటీవల మహారాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీనిపై పెద్దఎత్తున విమర్శలు రావడంతో.. తాజాగా వెనక్కి తగ్గింది. త్రిభాషా విధానం అమలుకు సంబంధించిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విధానంపై ఎలా ముందుకెళ్లాలి, దాన్ని ఎలా అమలు చేయాలనే దానిపై విద్యావేత్త నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం దేవేంద్ర ఫడణవీస్ ప్రకటించారు. ''ఒకటో తరగతి నుంచి త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడానికి సంబంధించి ఏప్రిల్, జూన్‌లలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఈ విధానం అమలుపై సిఫార్సులు చేసేందుకు డా.నరేంద్ర జాదవ్ నేతృత్వంలో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం'' అని ముంబయిలో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం ఫడణవీస్ తెలిపారు. 1 నుంచి 12వ తరగతి వరకు ఈ విధానాన్ని



ప్రవేశపెట్టాలని డా.రఘునాథ్ మషేల్కర్ కమిటీ చేసిన సిఫార్సులను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉద్ధవ్ ఠాక్రే అంగీకరించారని, దాని అమలుపై ఒక కమిటీని కూడా ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. జాతీయ విద్యా విధానం(ఎన్‌ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగంగా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. ఈ విధానాన్ని తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ద్విభాషా సూత్రానికే కట్టుబడి ఉంటామని, హిందీని బలవంతంగా రుద్దితే ఊరుకోబోమని డీఎంకే స్పష్టం చేస్తోంది. ఈ క్రమంలోనే.. ఇంగ్లీష్, మరాఠీ మీడియం పాఠశాలల్లో చదువుతున్న 15 తరగతుల విద్యార్థులకు హిందీని మూడో భాషగా తప్పనిసరి చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం తొలుత ఏప్రిల్ 16న ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో.. హిందీని ఆప్షనల్‌గా మారుస్తూ సవరణ ఉత్తర్వు జారీ చేసింది. అయినా.. ప్రతిపక్షాల నుంచి పెద్దఎత్తున విమర్శలు కొనసాగాయి. ఈ క్రమంలో ప్రభుత్వంపై పోరాడేందుకు శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, 'మహారాష్ట్ర నవ నిర్మాణ్ సేన' (ఎంఎన్‌ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేలు ఏకం కానున్నారనే చర్చ మొదలైంది. ఈ పరిణామాల నడుమ రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తగ్గింది. దీంతో వచ్చే నెల 5న శివసేన యూబీటీ, ఎంఎన్‌ఎస్‌ల ఆధ్వర్యంలో నిర్వహించాలనుకున్న నిరసనను రద్దు చేస్తున్నట్లు సంజయ్ రౌత్ ప్రకటించారు.

## సీఎం గారూ మొర ఆలకించండి.. మా బతుకులు దుర్భరమయ్యాయ్!



బెంగళూరు: కర్ణాటక వ్యాప్తంగా బైకు ట్యాక్సీ సేవలపై నిషేధం ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ.. 'బైక్స్ ట్యాక్సీ వెల్ఫేర్ అసోసియేషన్' సభ్యులు ఆదివారం బెంగళూరులో నిరాహార దీక్ష చేపట్టారు. ఈ అంశంపై సమగ్ర విధానానికి రూపకల్పన చేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు బహిరంగ లేఖ రాశారు. బెంగళూరు, మైసూరు, మాండ్య, దావణగిరె, రామనగర తదితర ముఖ్య ప్రాంతాల్లోనూ పెద్ద సంఖ్యలో బైక్ రైడర్లు నిరసనలు చేపట్టారు. ''సార్, ఎండనక, వాననక బైక్‌లు నడుపుతూ రాష్ట్రం ప్రజలకు సేవ చేస్తున్నాం. కోపంతో ఈ లేఖ రాయడం లేదు. తీవ్ర నిరాశతో రాస్తున్నాం. మాలో చాలా మందికి ఈ పని ఉపాధి కల్పిస్తోంది. గౌరవంగా బతికేలా చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో చాలా మంది పని కోల్పోయారు. వాళ్ల పరిస్థితులు దుర్భరంగా మారాయి. కొందరు తమ కుటుంబాలను పోషించడానికి భిక్షాటనకు కూడా వెళ్తున్నారు. ఇప్పటికైనా మా మొర ఆలకించండి. లేదంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతాం'' అని సీఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు. ఈ నెల 16 నుంచి కర్ణాటక వ్యాప్తంగా బైకు ట్యాక్సీ సేవలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. మోటారు వాహనాల చట్టం కింద రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసేంత వరకు బైకు ట్యాక్సీల కార్యకలాపాలను నిలిపివేయాలని గతంలో హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, వాటిపై స్టే విధించేందుకు జూన్ 13న హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా బైకు ట్యాక్సీ సేవలు నిలిచిపోయాయి.

## మరో మూడు నెలల్లో కర్ణాటక సీఎంగా డీకే శివకుమార్!

బెంగళూరు: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం పదవి స్వీకరిస్తారంటూ గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే హెచ్.ఎ. ఇక్బాల్ హుస్సేన్ ఆదివారం ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ..మళ్లీ అదే విషయాన్ని తెరపైకి తీసుకువచ్చారు. మరో రెండు, మూడు నెలల్లో ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశముందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి ఎవరు కృషి చేశారో అందరికీ తెలుసని.. ప్రస్తుతం పార్టీ అధిష్ఠానం శివకుమార్ గురించే మాట్లాడుతోందన్నారు.




ఈ ఏడాది చివర్లో కర్ణాటక ప్రభుత్వంలో నాయకత్వ మార్పు గురించి ఊహాగానాలు వస్తున్న నేపథ్యంలో శివకుమార్‌కు సన్నిహితుడైన ఇక్బాల్ హుస్సేన్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సెప్టెంబర్ తర్వాత రాష్ట్ర రాజకీయాల్లో 'విప్లవాత్మక' పరిణామాలు నెలకొంటాయని కర్ణాటక మంత్రి కె.ఎన్. రాజన్న ఇటీవల పేర్కొన్నారు. దీంతో త్వరలోనే నాయకత్వ మార్పు తథ్యమని అధికార పార్టీలోనూ విస్తృత చర్చ నడుస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందిస్తూ.. నాయకత్వ మార్పు అనేది అధిష్ఠానం పరిధిలో ఉందని, దీనిపై బహిరంగంగా వ్యాఖ్యానించలేనని పేర్కొన్నారు.

# విద్యావ్యవస్థ అస్తవ్యస్తం... ఏపీఈసెట్ అడ్మిషన్లే పెద్ద ఉదాహరణ: జగన్

* ఈసెట్ కౌన్సెలింగ్‌లో తీవ్ర జాప్యం అంటూ ప్రభుత్వంపై విరుచుకుపడిన జగన్
* ఫలితాలొచ్చి 45 రోజులైనా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కాలేదని విమర్శ
* "అమాత్యా మేలుకో, పప్పూ నిద్ర వదులు" అంటూ ఘాటు వ్యాఖ్యలు




రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని, అందుకు ఏపీ ఈసెట్ అడ్మిషన్ల ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యమే నిదర్శనమని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఫలితాలు వెలువడి నెలన్నర రోజులు గడుస్తున్నా ఇంతవరకు కౌన్సెలింగ్ ప్రారంభించకపోవడం ప్రభుత్వ అసమర్థతకు పరాకాష్ఠ అని విమర్శించారు. ఈసెట్ ఫలితాలు గత నెల మే 15వ తేదీన వెలువడినా, నేటికీ అడ్మిషన్ల ప్రక్రియపై ఎలాంటి షెడ్యూల్ విడుదల చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని జగన్ పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఎంత దారుణంగా అస్తవ్యస్తంగా మారిందో చెప్పడానికి ఈ ఒక్క ఉదాహరణ చాలని ఆయన అన్నారు. రేపటి నుంచి ఇంజినీరింగ్ విద్యార్థులకు తరగతులు ప్రారంభం కానుండగా, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన "అమాత్యా మేలుకో.. పప్పూ నిద్ర వదులు" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశాల కోసం రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 34 వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ పరీక్షకు హాజరుకాగా, వారిలో 31,922 మంది అర్హత సాధించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఇంతమంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని జగన్ ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి, ఈసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసి, అడ్మిషన్ల ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



## రెండో నవలకే నేషనల్ అవార్డ్..
## యువ రచయిత ప్రసాద్ సూరిపై సీఎం ప్రశంసలు

* యువ రచయిత ప్రసాద్ సూరికి ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య యువ పురస్కారం
* పేద మత్స్యకార కుటుంబం నుంచి వచ్చిన యువకుడికి అరుదైన గౌరవం
* ప్రసాద్ సూరిని సోషల్ మీడియా వేదికగా అభినందించిన సీఎం చంద్రబాబు
* రాసిన రెండో నవలకే ఈ పురస్కారం లభించడం విశేషం
* ప్రసాద్ రాష్ట్రానికి, తన జాతికి కీర్తి తెచ్చారని కితాబు
* సాహిత్యంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్ష

యువ రచయిత ప్రసాద్ సూరి (సూరాడ ప్రసాద్) ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య యువ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పేద మత్స్యకార కుటుంబంలో పుట్టి, సాహిత్యంపై మక్కువతో అద్భుతమైన ప్రతిభ కనబరచడం ఎంతో సంతోషాన్నిచ్చే విషయమని కొనియాడారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "పేద మత్స్యకార కుటుంబంలో పుట్టి సాహిత్యంపై మక్కువతో రాసిన రెండో నవలకే ప్రతిష్ఠాత్మక కేంద్ర సాహిత్య యువ పురస్కారం అందుకోవడం ఎంతో ఆనందదాయకం. ఇంతటి అద్భుత ప్రతిభ కనబరిచిన ప్రసాద్ సూరి (సూరాడ ప్రసాద్)కి అభినందనలు. సముద్రపు లోతు చూసే మత్స్యకారులకు మనిషి జీవితపు ఎత్తుపల్లాలు చూడడం కష్టమేమీ కాదు అని నిరూపించిన ప్రసాద్ సూరి రానున్న రోజుల్లో సాహిత్యపు శిఖరం తాకాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నాను. రాష్ట్రానికి, తను జన్మించిన జాతికి ఎనలేని ప్రతిష్ఠ తెచ్చిపెట్టిన ప్రసాద్ సూరికి మరొక్క మారు శుభాభినందనలు" అంటూ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.




## అది జగన్ కారే.. నిర్ధారించిన ఫోరెన్సిక్ నివేదిక?

పల్నాడు జిల్లాలో వైసీపీ అధినేత జగన్ పర్యటన సందర్భంగా జరిగిన ప్రమాదంలో సింగయ్య మృతి చెందిన ఘటన కీలక మలుపు తిరిగింది. ఈ ప్రమాదానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో అసలైనదేనని, అందులో ఎలాంటి మార్ఫింగ్ జరగలేదని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) తన నివేదికలో స్పష్టం చేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ నివేదిక పోలీసులకు అందడంతో దర్యాప్తులో ఇది ఒక ముఖ్యమైన ఆధారంగా మారింది. పర్యటన సందర్భంగా జగన్ ప్రయాణిస్తున్న కారు ముందు చక్రం కింద సింగయ్య నలిగిపోతున్న దృశ్యాలు ఒక సెల్‌ఫోన్‌లో రికార్డయ్యాయి. ఆ తర్వాత ఆ వీడియో వైరల్ అయింది. అయితే, ఈ వీడియో నకిలీదని, జగన్‌ను ఈ కేసులో ఇరికించేందుకు మార్ఫింగ్ చేశారని వైసీపీ నాయకులు ఆరోపణలు చేశారు. ఈ నేప థ్యంలో, పోలీసులు ఆ వీడియో క్లిప్‌ను, ఘటనా స్థలంలో డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన ఫుటేజీని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. వీడియో రికార్డ్ చేసిన సెల్‌ఫోన్ ఐడీ, అది ఉన్న లొకేషన్ వంటి సాంకేతిక వివరాలను విశ్లేషించిన నిపుణులు, ఆ వీడియో ఒరిజినల్ అని, ఎడిటింగ్ జరగలేదని నిర్ధారించినట్టు తెలిసింది.

### జులై 1న హైకోర్టులో విచారణ

ఈ కేసులో తన ప్రమేయం లేదని, తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ జగన్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై జులై 1న ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరగనుంది. అదే రోజున పోలీసులు ఫోరెన్సిక్ నివేదికను కోర్టుకు సమర్పించే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక నివేదికను అడ్వకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీనివాస్ మొన్న కోర్టుకు అందించారు. పూర్తి సాంకేతిక ఆధారాలు సమర్పించేందుకు గడువు కోరగా, కోర్టు అందుకు అంగీకరించింది

### పకడ్బందీగా పోలీసుల దర్యాప్తు

ఈ కేసులో పోలీసులు మొదటి నుంచి పకడ్బం దీగా ఆధారాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనానికి ఇప్పటికే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేశారు. ఘటనను ప్రత్యక్షంగా చూసిన దాదాపు పది మంది సాక్షుల వాంగ్మూ లాలను నమోదు చేశారు.

## ఇక మీకు రఫా రఫానే..
## పెద్దారెడ్డికి జేసీ ప్రభాకర్ రెడ్డి మాస్ వార్నింగ్!

* తాడిపత్రిలో మరోసారి భగ్గుమన్న రాజకీయ వైరం
* తాను మూడు రోజులు ఊళ్లో ఉండటం లేదని జేసీ ప్రకటన
* నీ ఇల్లు కూలగొట్టేస్తారేమో అంటూ వ్యాఖ్యలు
* తన శత్రువు పెద్దారెడ్డే కానీ వైసీపీ కార్యకర్తలు కాదన్న జేసీ
* తన పోరాటం చట్టబద్ధంగానే ఉంటుందని వెల్లడి



అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గంలో రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి తన రాజకీయ ప్రత్యర్థి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. తాను కొన్ని రోజుల పాటు ఊరిలో ఉండటం లేదని, ఈ సమయంలో ఇంటిని జాగ్రత్తగా కాపాడుకోవాలని, లేదంటే కూల్చివేస్తారేమోనని జేసీ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాపంగా సంచలనం రేపుతున్నాయి. ఇక మీకు రఫా రఫా తప్పదని హెచ్చరించారు. తాజాగా తన అనుచరులతో మాట్లాడిన జేసీ ప్రభాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిని ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. "నేను ఊరికి వెళుతున్నా. ఓ మూడు రోజుల్లో నీ ఇంటిని ప్రొక్లైనర్ పెట్టి కూల్చేస్తారేమో.. కాపాడుకో పెద్దారెడ్డి. నీకోసమే కాచుకుని ఉన్నారు" అంటూ బహిరంగంగా హెచ్చరించారు. తన కార్యకర్తలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని, ఇన్నాళ్లూ తానే వారిని అదుపు చేస్తూ వచ్చానని తెలిపారు. "మా వాళ్లు చాలా కోపంగా ఉన్నారు. రఫ్ఫాడించడానికి సిద్ధంగా ఉన్నారు. నేను గట్టిగా పట్టుకుని కూర్చున్నాను కాబట్టే ఆగుతున్నారు. నేను లేనప్పుడు ఏం జరుగుతుందో చూసుకో" అని వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ హయాంలో తాము, తమ కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడ్డామని, మహిళలు కూడా జైలుకు వెళ్లారని జేసీ గుర్తుచేశారు. ఆ కక్షతోనే తన అనుచరులు రగిలిపోతున్నారని ఆయన పేర్కొన్నారు. అయితే, తన శత్రుత్వం కేవలం కేతిరెడ్డి పెద్దారెడ్డితోనే తప్ప, వైసీపీ కార్యకర్తలతో కాదని ఆయన స్పష్టం చేశారు. "మాకు శత్రువు పెద్దారెడ్డి మాత్రమే, వైసీపీ కార్యకర్తలు కాదు. ఇప్పటివరకు మేం ఏ కార్యకర్తను ఏమీ అనలేదు. అందరిపైనా చట్ట ప్రకారమే ముందుకెళుతున్నాం," అని జేసీ వివరించారు. పెద్దారెడ్డి ఇంటి నిర్మాణంలో కూడా చట్టపరమైన లోపాలు ఉన్నాయని, అయినా తాము చట్టబద్ధంగానే వెళుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తన పోరాటం వ్యక్తిగతమని, తాను, తన పిల్లలు ఈ శత్రుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ప్రభాకర్ రెడ్డి తేల్చిచెప్పారు. ప్రజలకు తాను ఏంటో తెలుసని, అందుకే తనను గెలిపించారని అన్నారు. జేసీ చేసిన ఈ వ్యాఖ్యలతో తాడిపత్రిలో మరోసారి రాజకీయ ఉద్రిక్తత వాతావరణం నెలకొంది.

## అది జగన్ కారే.. నిర్ధారించిన ఫోరెన్సిక్ నివేదిక?

* సింగయ్య మృతి ఘటనలో వీడియో అసలైనదేనని నిర్ధారణ?
* వీడియోలో ఎలాంటి మార్ఫింగ్ జరగలేదని తేల్చిన ఫోరెన్సిక్ నివేదిక!
* జులై 1న జగన్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ
* అదే రోజున కోర్టుకు ఫోరెన్సిక్ నివేదికను సమర్పించనున్న పోలీసులు

పల్నాడు జిల్లాలో వైసీపీ అధినేత జగన్ పర్యటన సందర్భంగా జరిగిన ప్రమాదంలో సింగయ్య మృతి చెందిన ఘటన కీలక మలుపు తిరిగింది. ఈ ప్రమాదానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో అసలైనదేనని, అందులో ఎలాంటి మార్ఫింగ్ జరగలేదని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) తన నివేదికలో స్పష్టం చేసినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఈ నివేదిక పోలీసులకు అందడంతో దర్యాప్తులో ఇది ఒక ముఖ్యమైన ఆధారంగా మారింది. పర్యటన సందర్భంగా జగన్ ప్రయాణిస్తున్న కారు ముందు చక్రం కింద సింగయ్య నలిగిపోతున్న దృశ్యాలు ఒక సెల్‌ఫోన్‌లో రికార్డయ్యాయి. ఆ తర్వాత ఆ వీడియో వైరల్ అయింది. అయితే, ఈ వీడియో నకిలీదని, జగన్‌ను ఈ కేసులో ఇరికించేందుకు మార్ఫింగ్ చేశారని వైసీపీ నాయకులు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో, పోలీసులు ఆ వీడియో క్లిప్‌ను, ఘటనా స్థలంలో డ్రోన్ కెమెరాతో చిత్రీకరించిన ఫుటేజీని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. వీడియో రికార్డ్ చేసిన సెల్‌ఫోన్ ఐడీ, అది ఉన్న లొకేషన్ వంటి సాంకేతిక వివరాలను విశ్లేషించిన నిపుణులు, ఆ వీడియో ఒరిజినల్ అని, ఎడిటింగ్ జరగలేదని నిర్ధారించినట్టు తెలిసింది. జులై 1న హైకోర్టులో విచారణ ఈ కేసులో తన ప్రమేయం లేదని, తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ జగన్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై జులై 1న ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరగనుంది. అదే రోజున పోలీసులు ఫోరెన్సిక్ నివేదికను కోర్టుకు సమర్పించే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక నివేదికను అడ్వకేట్ జనరల్ దమ్మలపాటి శ్రీనివాస్ మొన్న కోర్టుకు అందించారు. పూర్తి సాంకేతిక ఆధారాలు సమర్పించేందుకు గడువు కోరగా, కోర్టు అందుకు అంగీకరించింది.పకడ్బందీగా పోలీసుల దర్యాప్తు ఈ కేసులో పోలీసులు మొదటి నుంచి పకడ్బందీగా ఆధారాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనానికి ఇప్పటికే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేశారు. ఘటనను ప్రత్యక్షంగా చూసిన దాదాపు పది మంది సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులు ఈ కేసులో జగన్‌తో పాటు కారు డ్రైవర్ రమణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, పేర్ని నాని, విడదల రజని తదితరులను నిందితులుగా చేర్చారు. అయితే, ప్రధాన నిందితుడు, కారు డ్రైవర్ అయిన ఏఆర్ కానిస్టేబుల్ రమణారెడ్డి విచారణకు సరిగా సహకరించడం లేదని సమాచారం. ప్రమాద సమయంలో కారు బానెట్‌పై ఒక కార్యకర్త ఉండటంతో తనకేమీ కనిపించలేదని, అసలు చక్రాల కింద వ్యక్తి పడిన విషయమే తనకు తెలియదని పోలీసుల వద్ద వాదించినట్టు తెలిసింది. స్థానికులు అప్రమత్తం చేసిన తర్వాత కారును వెనక్కి తీసినట్లు వీడియోలో ఉన్నా, డ్రైవర్ తన వాదన మార్చుకోలేదని తెలుస్తోంది.

## ఏపీ బీజేపీ అధ్యక్ష పదవికి నేడు నోటిఫికేషన్ ..
## రేసులో ఈ ఆరుగురు కీలక నేతలు

ఆంధ్రప్రదేశ్ బీజేపీకి త్వరలో కొత్త సారథి రానున్నారు. పార్టీ సంస్థాగత ఎన్నికల అధికారి, రాజ్యసభ సభ్యుడు పాకా వెంకట సత్యనారాయణ ఇప్పటికే అధ్యక్ష ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. ఈ రోజు (జూన్ 29) ఏపీ బీజేపీ అధ్యక్ష ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడంతో పాటు అధ్యక్ష ఎన్నికల ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. రేపు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఆ తర్వాత గంట పాటు నామినేషన్ల స్క్రూటినీ, సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఇవ్వనున్నారు. ఒకటి కంటే ఎక్కువ నామినేషన్లు దాఖలైతే జులై 1వ తేదీన పోలింగ్ నిర్వహించి రాష్ట్ర అధ్యక్షుడిని ప్రకటించనున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియకు కర్ణాటక ఎంపీ పీసీ మోహన్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. కాగా, ప్రస్తుత పార్టీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి గత ఎన్నికల్లో పార్లమెంట్ సభ్యురాలిగా ఎన్నికైన నేపథ్యంలో పార్టీ సారథిని మార్చే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ అధ్యక్ష పదవి రేసులో పలువురు కీలక నేతలు ఉన్నారు. మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డితో పాటు మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరి, పార్టీ కీలక నేతలు నరసింహారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు అధ్యక్ష పదవి రేసులో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఉండటంతో బీజేపీ అధ్యక్షుడిగా ఎవరికి అవకాశం లభిస్తుందన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.


# పగటిపూట... కళ్లద్దాలు తీసేయొచ్చు..!

**ఆఫీసుకెళ్తూనో, స్కూల్‌కెళ్తూనో పొరపాటున కళ్లద్దాలని మర్చిపోతే ఇక ఆ బాధ పడేవాళ్లకే తెలుస్తుంది... అడుగడుగునా ఇబ్బందే! డ్రైవింగ్ చేయాలంటే భయం, దూరంగా ఉన్నవి చదవాలంటే చిక్కు... ఒక్క మాటలో చెప్పాలంటే ఆ రోజంతా చేతులు కట్టేసినట్టే! ఆ చిక్కులకు చెక్ పెట్టేందుకు వచ్చినవే ఆర్థో కె- లెన్స్...**



ఏడేళ్ల ఆద్విక్ కళ్లద్దాలు లేకుండా స్కూల్‌కి వెళ్లలేని పరిస్థితి... కానీ స్కూల్లో తోటి పిల్లలు వాటిని చూసి వెక్కిరిస్తూ, దాచి పెట్టి ఆటపట్టిస్తుంటే అమ్మ దగ్గరకు వచ్చి ఏడుస్తున్నాడు. వాళ్లమ్మ అప్పటికేదో ఓదార్చినా, దీనికి ఏదైనా పరిష్కారం ఉంటే బాగుండును అనుకుంది. సంహితని పెళ్లిచూపులు చూడ్డానికి వచ్చిన అబ్బాయి 'మీరు ఆ కళ్లద్దాలు లేకపోతే ఇంకా బాగుంటారు' అన్నాడు. అవి లేకుండా ఉంటే తను బాగుండే మాట నిజమే కానీ, తనకి దూరంగా ఉన్నవేవీ కనిపించవు. అంతా అలికినట్టుగా ఉంటుంది. బస్ నంబర్లు కనిపించవు, సరిగా డ్రైవ్ చేయలేదు... అవి ఉండి తీరాల్సిందే. కళ్లద్దాలతో వచ్చే ఇలాంటి ఇబ్బందులు మనలో చాలామందికి తెలిసినవే! ఇందుకు పరిష్కారంగా కొంతమంది సర్జరీ చేయించుకుంటే, మరికొందరు కాంటాక్ట్ లెన్సులు వాడుతుంటారు. అయితే, వాటితోనూ కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. ఆటలాడే పిల్లలు పదేపదే కళ్లు నలుపుతూ ఉంటే ఆ లెన్సు పడిపోయే ప్రమాదం ఉంది. ఇలాంటి ఇబ్బందులు పడాల్సిన అవసరం లేకుండా వాటిని తీసేస్తే పోలా! అరె.. అదెలా సాధ్యం, వాటిని తీసేస్తే సరిగా కనిపించదు కదా అంటారా... అదీ నిజమే కానీ, ఇలా కళ్లద్దాలూ, లెన్సులతో వచ్చే చిక్కులను తొలగించేందుకు వచ్చినవే 'ఆర్థో కెరటాలజీ లెన్స్', సంక్షిప్తంగా ఆర్థో కె లెన్స్ అంటారు. ఆర్థో అంటే నేరుగా అనీ, కెరటో అంటే కార్నియా అనీ అర్థం. అంటే కార్నియాని సరిచేసే లెన్సులన్నమాట ఇవి. వీటిని రాత్రుళ్లు పెట్టుకుంటే చాలు, పగలు పెట్టుకోవాల్సిన అవసరమే లేదు. ఇదేదో మ్యాజిక్‌లా ఉందే అనుకుంటున్నారు కదా, వీటి పనితీరు ఎలా ఉంటుందో తెలుసుకుందాం.






### రాత్రుళ్లు పెట్టుకుంటే...


దూరంగా ఉన్న వస్తువులు అస్పష్టంగా కనిపించడాన్నే వైద్య పరిభాషలో మయోపియా అంటారు. ప్రస్తుతం మనదేశంలో పాతికశాతం పిల్లలు ఈ మయోపియా సమస్యతోనే బాధపడు తున్నారట. అందుకే ఐదేళ్ల వయసు పిల్లలు కూడా కళ్లద్దాలు పెట్టుకోవాల్సిన పరిస్థితి. అవి అడ్డంగా ఉంటే పిల్లలు తమకు నచ్చిన క్రికెట్‌తో సహా ఏ ఆటనీ స్వేచ్ఛగా ఆడుకోలేరు, ఎందుకంటే అద్దాలు పడిపోతాయేమోనని భయం. ఇక సర్జరీకి వెళ్లాలన్నా దాన్ని ఇరవై ఏళ్లు దాటితే కానీ చేయరు. మరి అంతవరకూ మయోపియా సమస్య ముదరకుండా అదుపులో ఉంచడానికీ, కళ్లద్దాల అవసరాన్ని తగ్గించడానికీ వచ్చినవే ఈ ఆర్థోకె లెన్స్. వీటిని రాత్రి వేళ పెట్టుకుని పడుకుంటే చాలు. తెల్లవారేసరికి అన్నీ స్పష్టంగా కనిపిస్తాయి. పగటిపూట కళ్లద్దాలు కానీ, లెన్సులు కానీ వాడాల్సిన అవసరమే లేదు. ఇది ఎలా సాధ్యం అవుతుందంటే... ఈ ప్రత్యేకమైన లెన్సులు రాత్రంతా కంటిలోని కార్నియాపైన సున్నితంగా ఒత్తిడి తీసుకొచ్చి కార్నియాని సరైన ఆకృతిలో ఉంచుతాయి. దాంతో తెల్లారి మనకి స్పష్టమైన చూపు వస్తుంది. 'పూర్వపు రోజుల్లో యుద్ధ సమయంలో సైనికులకి చూపు తగ్గితే చాలా ఇబ్బందులు వచ్చేవి. అలాంటప్పుడు బాణం గురితప్పకుండా ఉండేందుకు రాత్రి నిద్రపోయే ముందు తేలికపాటి ఇసుక మూటలని కంటిపైన పెట్టుకుని పడుకునేవారట. తెల్లారితే చూపు మెరుగయ్యేది. దీన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటితరానికి తగ్గట్టుగా శాస్త్రవేత్తలు తీర్చిదిద్దినవే ఆర్థోకె లెన్స్. వీటిని పెట్టుకున్న వారం నుంచి రెండు వారాల్లో పూర్తి స్థాయిలో ఫలితాలని ఇస్తాయి. అయితే ప్రతిరోజూ రాత్రి ధరించడం తప్పనిసరి. ఐదేళ్ల నుంచి 60 ఏళ్ల వరకూ ఎవరైనా వీటిని వాడొచ్చు. ఆ తర్వాత కూడా ఇతర కంటి సమస్యల్లేకుండా ఉంటే వీటిని సిఫారసు చేస్తాం. చిన్న పిల్లల్లో మయోపియా పెరగకుండా చేయడానికి ఇవి బాగా ఉపయోగపడతాయి. స్విమ్మింగ్, ఫుట్‌బాల్, మార్షల్ ఆర్ట్స్, రన్నింగ్ వంటి వాటిల్లో రాణించాలనుకునే పిల్లలకు ఇవి ఎక్కువగా లాభిస్తాయి' అంటున్నారు ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్న మయోపియా స్పెషలిస్ట్ డాక్టర్ పవన్ వెరికిచర్ల. 'వైద్యులు చెప్పినట్టుగా జాగ్రత్తగా దాచుకుంటే ఏడాదీ ఆపైన మరికొన్ని నెలల వరకూ మన్నుతాయి. ఆ తర్వాత మార్చుకోవాల్సి ఉంటుంది, అలా ఎన్నాళ్లైనా వీటిని కొనసాగించవచ్చు' అంటున్నారు కాంటాక్ట్‌లెన్స్ స్పెషలిస్ట్ కిరణ్మయి చప్పిడి. ఒకప్పుడు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే ఈ లెన్సులని, ప్రస్తుతం ఎల్‌వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ వాళ్లే స్వయంగా తయారు చేస్తున్నారు. చైనా, సింగపూర్‌వంటి దేశాల్లో అధికంగా వాడే ఈ లెన్సులకి ఈ మధ్యనే మన దగ్గరా ఆదరణ పెరుగుతోందట.



# కొత్త రుచుల చాక్లెట్లోచ్!







**నోరూరించే చాక్లెట్‌ని చూస్తే... చిన్నా, పెద్దా ఎవరి మనసైనా అదుపు తప్పతుంది. అలాంటి చాక్లెట్‌తో జిగేల్‌మనే రంగులు కూడా జతకడితే ఎలా ఉంటుందో ఊహించండి. ఇక, ఆ చాక్లెట్ అందమైన మైనపు కళాకృతిలా కనిపిస్తే తినాలో, దాచుకోవాలో తెలియక తికమక పడాల్సిందే! అలాంటి నయారకం చాక్లెట్లే ఇవన్నీ...**




### ధగధగా మెరిసే హోలోగ్రామ్‌తో

చాక్లెట్‌పైన ఉండే రేపర్ మెరవడంలో కొత్తేం లేదు, అదే... చాక్లెట్టే ధగధగా మెరిసిపోతే ఎలా ఉంటుంది? ఇంద్ర ధనుస్సు రంగుల్లో మెరిసిపోవడమే... ఇరిడిసెంట్ చాక్లెట్ లేదా హోలోగ్రామ్ చాక్లెట్ల ప్రత్యేకత. మెరుపుల చాక్లెట్లు అంటున్నారు... వీటిని తినొచ్చా అనే అనుమానం రావొచ్చు. ఈ చాక్లెట్లని ఏ భయమూ లేకుండా హాయిగా తినొచ్చు. ఎందుకంటే వీటిని స్విట్జర్లాండ్ శాస్త్రవేత్తలు ఎటువంటి కృత్రిమ రంగులూ, నిల్వ కారకాలూ వాడకుండా ప్రత్యేకమైన సాంకేతికతని వాడి తయారుచేశారు కాబట్టి. ఇది ఎలా సాధ్యం అయిందంటే... కాంతి పరావర్తనం చెందినప్పుడు ఏడు రంగులుగా విడిపోయి ఇంద్రధనుస్సు వర్ణాల్లోకి మారుతుందని తెలుసుకదా. ఇక్కడా ఆ సూత్రాన్నే వాడారు. ప్రత్యేకమైన ఫుడ్‌గ్రేడ్ ఫాయిల్స్‌ని తీసుకుని దానిపైకి కాంతిని పంపించి, ఆపైన కరిగించిన వేడి చాక్లెట్‌ని పోస్తారు. అది చల్లారి చాక్లెట్‌గా మారాక ఆపైన ఉండే ఫాయిల్‌ని తొలగిస్తారు. అలా హోలోగ్రామ్ తరహాలో జిగేల్‌మంటూ కాంతిని వెదజల్లే చాక్లెట్లు తయారవుతాయి. కొందరు ఇంట్లోనే వివిధ రుచుల్లో చాక్లెట్లని తయారు చేస్తుంటారు కదా... అలాంటివారి కోసం హోలోగ్రామ్ చాక్లెట్ మౌల్డ్స్ కూడా బజారులో దొరుకుతున్నాయి. వాటితో ఇంట్లో కూడా ఈ మెరుపుల చాక్లెట్లని ప్రయత్నించవచ్చు.




### మధ్యలో పీచుమిఠాయి

చాక్లెట్ రుచే అద్భుతం... ఇక దానికి పిస్తా పలుకులూ, బాదం, వాల్‌నట్స్ వంటి డ్రైఫ్రూట్స్ కూడా కలిస్తే ఆ రుచి వేరే లెవల్‌లో ఉంటుందని ప్రత్యేకించి చెప్పనక్కర్లేదేమో! పిస్తా పలుకులతో చేసే కునాఫా చాక్లెట్ ఆ కోవకే చెందుతుంది. ఈ పరంపరని కొనసాగిస్తూ వచ్చిన మరో కొత్త రుచే ఏంజెల్ హెయిర్ చాక్లెట్. ఏంజెల్ హెయిర్ అంటే మనం తినే సోన్‌పాపిడి, పీచుమిఠాయి తరహాలో ఉండే ఒకరకం టర్కిష్ స్వీట్. ఇది వేర్వేరు రుచులూ, రంగుల్లో దొరుకుతుంది. ఇప్పుడిది చాక్లెట్ మధ్యలోకి చేరి కొత్తగా అలరిస్తోంది. చాక్లెట్‌ని మధ్యలోకి తుంచినప్పుడు వివిధ రంగుల్లో బయటపడే ఈ ఏంజెల్ హెయిర్ పిస్తా క్రీమ్, ఆల్మండ్ బటర్‌తో కలిసి సర్‌ప్రైజ్ రుచులను అందిస్తోంది. నోట్లో పెట్టుకోగానే క్షణాలమీద కరిగిపోయే వీటిని కుర్రకారు తమ ఫేవరెట్ చాక్లెట్ల జాబితాలోకి చేర్చుకుంటోందంటే ఆశ్చర్యం ఏముంది!

### క్యాండిల్ కాదు... క్యాండీ

మైనపు కొవ్వొత్తులూ, బొమ్మల గురించి తెలిసిందే. మరి మైనపు చాక్లెట్ల గురించి ఎప్పుడైనా విన్నారా? ఇవి చూడ్డానికి మైనంతో చేసిన బొమ్మల్లానే ఉంటాయి కానీ... నోట్లో పెట్టుకుంటే గమ్మత్తయిన రుచీ, పరిమళంతో మళ్లీమళ్లీ తినాలనిపిస్తాయి. వీటినే వ్యాక్స్ క్యాండీస్ అంటున్నారు. మైనం ఏంటీ, చాక్లెట్ ఏంటీ అసలు ఏమీ అర్థం కావడం లేదూ అంటారా... మరేం లేదు, వీటిని నాణ్యమైన ఫుడ్‌గ్రేడ్ బీస్ వ్యాక్స్‌ని వాడి తయారుచేస్తున్నారు. తేనెలో ఉండే తీపి వల్ల ఈ చాక్లెట్లు భిన్నమైన రుచితో ఉంటాయి. అదొక్కటే వీటి ప్రత్యేకత కాదు... మైనంతో అందమైన బొమ్మలని చేసే కళ ఎలానూ వాడుకలో ఉంది కదా, ఆ కళా నైపుణ్యాన్ని ఈ వ్యాక్స్ చాక్లెట్ల రూపకల్పనలోనూ ఉపయోగిస్తున్నారు తయారీదారులు. అందుకే అందమైన సీతాకోకచిలుకలూ, చూడముచ్చటైన కోటలూ, బుజ్జిబుజ్జి టెడ్డీబేర్‌లూ, మినీయేచర్ షేపులో ఒదిగిపోయిన డైనోసార్లూ... ఒకటేంటి, వందల ఆకృతుల్లో ఈ వ్యాక్స్ క్యాండీస్ సందడి చేస్తున్నాయి. మైనం అంటున్నారు తినడానికి ఎలా ఉంటుందో అనుకోవచ్చు... క్యాండీ బయట భాగం నమలడానికి బాగుంటే, లోపల వివిధ పండ్ల ఫ్లేవర్లతో చేసిన ఫిల్లింగ్స్ నోరూరిస్తుంటాయి.

